ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..





'జనంవార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889



మేడ్చల్ | శనివారం | 06.06.2026 | సంపుటి : 1 | సంచిక : 338 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్




## దేశంలో కొందరు నిరాశావాదులు

### అత్మనిర్భర్ భారత్', దేశ దృఢ సంకల్పన్ని విమర్శిస్తుంటారు

### సూరత్ సభలో రాహుల్‌పై ప్రధాని మోడీ పరోక్ష విమర్శలు

**దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారనీ, 'అత్మనిర్భర్ భారత్' ప్రచారాన్ని, దేశ దృఢ సంకల్పన్ని విమర్శించడమే వీళ్లు పనిగా పెట్టుకున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపైన, కాంగ్రెస్ పార్టీపైనా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ఇతర దేశాలపై ఆధారపడం వల్ల ఏ దేశం తాను నిజంగా సాధించాల్సిన అభివృద్ధిని అందుకోలేదన్న విషయాన్ని వీరు విస్మరిస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లోని సూరత్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడారు.**

న్యూఢిల్లీ, జూన్ 5 : కాంగ్రెస్ పార్టీ అల జడలు, అస్థిరతను వ్యాప్తి చేయడం ద్వారా అవకాశాలు పొందాలని కోరు కుంటోందని, అయితే దేశ ప్రజలకు వీరి పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడు తూ వస్తున్నారని ప్రధాని అన్నారు. 'గుజ రాత్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అడ్రెస్ లేకుండా చేసారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల కూడా వారి అవకతవకల పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల హిమాచల్ ప్రదేశ్

-మిగతా 2 లో..



04

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



## మాజీ ప్రియురాలి దారుణ హత్య

- 20 సార్లు కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన ప్రేమోన్మాది
- అనంతరం అదే కత్తితో పొడుచుకున్న దుండగుడు
- యువతి మృతి.. యువకుడి పరిస్థితి విషమం

04

# నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ దోపిడీ

### కమీషన్లు దండుకుని ఒక్క ఎకరాకు నీరు అందించలే

పాలమూరు ఎంపిగా ఉన్నా జిల్లాకు కెసిఆర్ చేసింది శూన్యం

గతంలో ఇబ్బడిముబ్బడి అప్పులతో మళ్లీ అప్ప పుట్టకుండా చేశారు

జిల్లా ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం

రెండోరోజు జిల్లాలో పర్యటించిన సిఎం రేవంత్ రెడ్డి

కేసీఆర్ హయాంలో ఒక్కప్రాజెక్ట్ చేపట్టలేదు

కమిషన్ల కోసం కాళేశ్వరం చేపట్టినా..కూలింది

ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులో పెండింగే



**గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల కమీషన్లు కొల్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమీషన్లు దండుకొని ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని ఆగ్రహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి రెండోరోజు పర్యటించారు. బీఆర్ఎస్ హయాంలో కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం.. రెండోరోజు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు.**

మహబూబ్‌నగర్, జూన్ 5 : అనంతరం కరివె న రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెం డింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి అవస రమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం అని అన్నారు. . మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచర ణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజె క్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి

-మిగతా 2 లో..

## పాలన చేతగాకపోతే రాజీనామా చేయండి

### ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక లేకుంటే ఎలా?

కేంద్రాన్ని తిడుతూ సమస్యలను దాటవేస్తారా

సిఎం రేవంత్‌పై మండిపడ్డ ఎంపి అర్వింద్

**పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉ న్నాయని అన్నారు.**



**హైదరాబాద్, జూన్ 5 :** రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదని అరవింద్ వ్యాఖ్యానిం చారు. ఇది సిఎంగా ఆయన వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వరికోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై

-మిగతా 2 లో..



## సంస్కృతి సాంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన చేనేత

### థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభం

7వ తేదీ వరకు కొనసాగనున్న చేనేత ప్రదర్శన.

పోచంపల్లి చేనేత కళకు అంతర్జాతీయ గుర్తింపు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జూన్ 5 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తు న్న థ్రెడ్ పోచంపల్లి చేనేత వస్త్ర ప్రదర్శనను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. పోచంపల్లి ఇక్కత్ చేనేత కళకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడి నేతన్నల నైపుణ్యం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన చేనేత సంప్రదాయాన్ని భావిత రాలకు అందించడం మనందరి బాధ్యత అని

-మిగతా 2 లో..

## హైదరాబాద్‌లో ఎబోలా కలవరం

### ఇప్పటికే గాంధీలో ఇద్దరికి చికిత్సలు




హైదరాబాద్, జూన్ 5 : హైదరాబాద్‌లో ఎబోలా అనుమానిత కేసులు కలకలం రేపాయి. ఎబోలా లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన ఇద్దరు వ్యక్తులను రాత్రి సమయంలో అపోలో ఆస్పత్రి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ఎమర్జెన్సీ విభాగంలో వారికి చికిత్స అందిస్తున్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న వైద్య బృందం అవసరమైన పరీక్షలు నిర్వహిస్తోంది. రోగుల ప్రయాణ వివరాలు, వైద్య చరిత్ర, సంప్రదించిన వ్యక్తుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. పరిస్థితిని ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షిస్తూ అవసరమైన జాగ్రత్తలు

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 128 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 155 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 240 (కిలో) |
| స్కిన్ లెస్ | 271 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹80

## ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు

కొత్త పార్టీ పెట్టబోతున్న అన్నామలై

ప్రజలు లక్ష్యంగా రాజకీయ పార్టీని నడిపిస్తా

బిజెపికి భారం కాకూడదనే బయటకు వచ్చా

ఒంటరిగా పోటీచేయాలన్న వాదనను పట్టించుకోని బిజెపి

గతంలో రజనీకాంత్ సార్ తనతో కలవమని కోరారు

మీడియా సమావేశంలో మాజీ బిజెపి నేత అన్నామలై

చెన్నై, జూన్ 5 : తమిళనాడు రాజకీయాల్లో కొంతకాలంగా ఆసక్తి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంతకాలం సీఎం విజ య్‌పై ఉన్న దృష్టి.. ఇప్పుడు అన్నామలై వైపు మళ్లింది. ఆయన ఇప్పటికే భాజపాను వీడ గా.. తన రాజకీయ భవిష్యత్తు గురించి తాజాగా మీడియాతో మాట్లాడారు. బిజెపికి రాజీనామా చేసిన మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు.



-మిగతా 2 లో..



## స్పా సెంటర్లలో అసాంఘీక కార్యకలాపాలు

మల్కాజిగిరి ప్రాంతంలో ఏకకాలంలో దాడులు 02

113 స్పా సెంటర్లపై పోలీసుల తనిఖీలు

## బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం

### నిధులు, నియామకాలు, నీళ్లలో వైఫల్యం

### బిజెపి కోసం ప్రజలు ఆశగా చూస్తున్నారు

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

మహబూబాబాద్,జూన్5 : తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శు క్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్ర మంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపం చ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొ క్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. బీఆర్ఎస్ పాలనలో

-మిగతా 2 లో..





## దేశంలో కొందరు నిరాశావాదులు

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఇందుకు ఉదాహరణ. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఆ పార్టీ దారుణమైన ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ అవకతవకల పాలనను హిమాచల్ ప్రజలు తిప్పికొట్టారు. దీనికి ముందు హర్యానాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. పంజాబ్ ప్రజలు కూడా ఆ పార్టీకి స్పష్టమైన సందేశం ఇచ్చారు. అల్లకల్లోలంలో అవకాశాలు వెతుక్కోవడం అనే కాంగ్రెస్ రాజకీయం ఎప్పటికీ పనిచేయదు' అని మోదీ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అందుకే ముఖ్యమంత్రిని కూడా మార్చాల్సి వచ్చిందని ఇటీవల అక్కడ జరిగిన పరిణామలపై మోదీ వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు తమ కలలు, ఆకాంక్షలను కార్యరూపంలోకి రావాలనే పట్టుదలతో ఉన్నారని, దేశ ప్రజల సమష్టి సంకల్పంతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఇటీవల కాలంలో అనేక సంక్షోభాలను ప్రపంచం ఎదుర్కొందని, తొలుత కోవిడ్ సంక్షోభం, ఆ తర్వాత ఇంధన సంక్షోభం కుదిపేసిందని అన్నారు. పెట్రోల్ ధరల్లో నిలకడ లేకపోవడం, సప్లయ్ చైన్స్ కుప్పకూలడం వంటివి చోటచేసుకున్నాయని, అయితే ప్రతి సంక్షోభాన్ని 140 కోట్ల మంది ప్రజలు సమష్టిగా ఎదుర్కోవడం తనకెంతో తృప్తినిచ్చిందని అన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా సూరత్‌లో రూ. 18,800 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

## పాలన చేతగాక పోతే రాజీనామా చేయండి

(మొదటిపేజీ తరువాయి)



ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్రంపై నెపం మోపడం సరికాదని విమర్శించారు. రాష్ట్రంలో ఎంత పంట ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించకుండా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని అరవింద్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకాకపోతే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దొంగ ఇసుక, మొరం రవాణా కోసం ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటే, రైతుల ధాన్యాన్ని తరలించేందుకు మాత్రం కొరత వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని అన్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపైనా విమర్శలు చేసిన ఆయన, ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను పరిష్కరించకుండా కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలకు అనుకూలంగా ముఖ్యమంత్రి ఇప్పటివరకు కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని అరవింద్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తుతూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్‌లో ఎబోలా కలవరం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటున్నారు. ఇప్పటికే.. కాంగోలో ఎబోలా మహమ్మారి వ్యాప్తిని అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర స్థితిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఈ మహమ్మారి వ్యాప్తిని ఎదుర్కోవడం చాలా కష్టం. ఎందుకంటే, ఇది అత్యంత అరుదైన వైరస్ రకానికి చెందినది. దీనికి ఎలాంటి టీకా లేదు. డీఆర్ కాంగోలో అంతర్గత సంఘర్షణలు నెలకొన్న ప్రాంతంలో ఈ కేసులు నమోదవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ మహమ్మారి వ్యాప్తి ఊహించినదానికంటే వేగంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేస్తోంది.

## భూకబ్జా కుట్రదారుడు బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్

### తమిళనాడు కాంచీపురంలో అరెస్ట్.. హైదరాబాద్‌కు తరలింపు

### వైకాపా నేతపై పలు సెక్షన్ల కింద కేసులు

**హైదరాబాద్, జూన్ 5 :** నగరంలో గండిపేట ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో ప్రధాన నిందితుడు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని కాంచీపురంలో అతడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ తీసుకువచ్చారు. నిందితుడిని పోలీసులు కోర్టులో హాజరుపర్చనున్నారు. నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఈవోడబ్ల్యూ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో బొల్లా బ్రహ్మనాయుడును అరెస్ట్ చేశారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. నకిలీ పత్రాల తయారీ, ఆర్థిక లావాదేవీలు, సంతకాల దుర్వినియోగంతోపాటు ఈ కేసులో ఇతర కుట్రదారుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు. హైదరాబాద్ గండిపేటలో సర్వే నెం.18లోని సుమారు10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బ్రహ్మ నాయుడు కుట్రపన్నారు. అందుకోసం నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులు, నకిలీ ప్రభుత్వ పత్రాలు సృష్టించారు. ఈ విషయాన్ని గుర్తించిన తహసీల్దార్ నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.990/2026గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిందితులుగా ఉన్న రాధాకృష్ణ, డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ భూమి కబ్జా కోసం రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిమ్మల కుటుంబానికి రూ.4 కోట్లు, రాధాకృష్ణకు రూ.4 కోట్లు, ఇతరులకు మరో రూ.4 కోట్లు చెల్లించినట్లు సమాచారం. నకిలీ పత్రాలు, ప్రభుత్వ అనుమతుల ద్వారా భూమిపై అక్రమ హక్కులు సృష్టించే ప్రయత్నం చేసినట్లు ఈ కేసు విచారణలో వెల్లడైంది. అయితే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం బ్రహ్మనాయుడు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో బ్రహ్మనాయుడు తీవ్ర నిరాశ చెందారు. మరో వైపు భూమి వ్యవహారంలో తనపై కేసు నమోదు కావడంతో బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారు. అతడి కోసం పోలీస్ బృందాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. చివరకు బ్రహ్మనాయుడు కాంచీపురంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించి.. అతడిని అరెస్ట్ చేశారు.

# నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)



భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు. అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని మండిపడ్డారు. కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని ఎద్దేవా చేశారు. పాలమూరు -రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారని అన్నారు. మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నాం. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారని రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేస్తాం. కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నాం. పనులకు అడ్డుపడకుండా ఉండాలని బీఆర్ఎస్ నేతలను కోరుతున్నా. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటివారు. బీఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది.. భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టయినా మొదలుపెట్టి పూర్తి చేసిందా చెప్పాలి. ప్రాణహిత-చేవెళ్ల పేరు, ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసు. ఆయన సొంతంగా మొదలుపెట్టిన ప్రాజెక్టు ఒక్కటీ రాష్ట్రంలో లేదు. కాళేశ్వరం కూలిన తర్వాత చుక్క నీళ్లు తీసుకోకుండా ఎక్కువ వరి ఉత్పత్తి చేశాంఅని రేవంత్ అన్నారు. జిల్లాకు కారు పార్టీ అధినేత తీరని అన్యాయం చేశారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. నీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని.. వారి పాలనలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారని రేవంత్ పేర్కొన్నారు. ఒక్క కాళేశ్వరంపైనే రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. అది పూర్తి చేసి ఉంటే 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం ఉండేదన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని.. వేల కోట్లు పెట్టి కేవలం పంపులు, లిఫ్టులు మాత్రమే నిర్మించారని సీఎం రేవంత్ మండిపడ్డారు. నీటి పారుదల శాఖలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఇప్పటికీ నగదు చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత 30 నెలల్లో రూ.52 వేల కోట్లకు పైగా అసలు, వడ్డీ చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు.తమ ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రతి 6 నెలలకోసారి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ పర్యటనలో సీఎం వెంట మంత్రులుఉ ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తదితరులు ఉన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన చేనేత

(మొదటిపేజీ తరువాయి)



పేర్కొన్నారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు లభించిన జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ ఇక్కడి కళాకారుల సృజనాత్మకతకు, నైపుణ్యానికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపని మంత్రి తెలిపారు. భూదాన్ ఉద్యమానికి చారిత్రక కేంద్రంగా నిలిచిన పోచంపల్లికి ప్రత్యేక స్థానం ఉందని, పోచంపల్లి రుమాళ్లు, ఇక్కత్ చీరలకు ప్రపంచ మార్కెట్‌లో మరింత ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండున్నర సంవత్సరాల్లో చేనేత రంగం అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం సుమారు రూ.1,400 కోట్లకు పైగా ఖర్చు చేశామని తెలిపారు. నేతన్నల ఉపాధికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. గ్లోబలైజేషన్ పోటీని ఎదుర్కొనేందుకు రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ సంస్థ ద్వారా చేనేత కుటుంబాల పిల్లలకు ఆధునిక డిజైన్లు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందించి అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. డూప్లికేట్ ఉత్పత్తుల వల్ల చేనేత బ్రాండ్‌కు కలిగే నష్టాన్ని నివారించడంలో కూడా ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గారిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనకు మరింత మంది ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు తీసుకుని చేనేత కళాకారులకు ప్రోత్సాహం అందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ..పోచంపల్లి నేతన్నలు అగ్గిపెట్టెలో పట్టేంత సన్నని చీరలను నేసి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. అందుకే పోచంపల్లి 'సిల్క్ సిటీ ఆఫ్ ఇండియా'గా ఖ్యాతి గడించింది. ఈ ఎగ్జిబిషన్ ద్వారా చేనేత కార్మికులకు మరిన్ని మార్కెటింగ్ అవకాశాలు, వారి శ్రమకు తగిన ఆదాయం లభించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టెక్స్టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సహకారంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చేనేత కార్మికుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతన్నలందరికీ అభినందనలు తెలిపారు. భువనగిరి జిల్లాలో సుమారు 12 వేల మంది చేనేత కార్మికులు, అనుబంధ వృత్తిదారులు తమ జీవనోపాధిని ఈ రంగంపైనే ఆధారపడి కొనసాగిస్తున్నారని మంత్రి తెలిపారు. వారి కష్టానికి తగిన గుర్తింపు, ఉత్పత్తులకు విస్తృత మార్కెట్, మెరుగైన ఆదాయం కల్పించాలనే లక్ష్యంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పోచంపల్లి ఇక్కత్, పుట్టపాక తెలియా రుమాలు వంటి భౌగోళిక గుర్తింపు (ఉవ) పొందిన ఉత్పత్తులు యాదాద్రి భువనగిరి జిల్లాకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని మంత్రి పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ చేనేత కళ, నేతన్నల అపూర్వ నైపుణ్యం, సంప్రదాయ వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా నిలుస్తుందన్నారు. ఇక్కడి నేతన్నలు ఇక్కత్, డబుల్ ఇక్కత్ పద్ధతుల్లో పత్తి, పట్టు, సికో వస్త్రాలను తయారు చేస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. కొత్త రాజకీయ ఉద్యమం చేయబోతున్నట్లు అన్నామలై తెలిపారు. భారతీయుడిగా, తమిళుడిగా గర్విస్తున్నానని, తన ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. తమిళనాడు అభివృద్ధే తన ప్రథమ ప్రాధాన్యమన్నారు. అన్నామలై శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మార్పు కోసమే బీజేపీలో చేరానన్నారు. రాజీనామా ఆమోదించిన బీజేపీ హైకమాండ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని అన్నారు. 'తమిళనాడులో బీజేపీ ఒంటిరిగా పోటీ చేయాలని ఆశించా. 18 నెలలుగా బీజేపీతో విభేదాలు ఉన్నాయి. బీజేపీకి నేను భారంగా ఉండాలనుకోవడం లేదు. అందుకే బీజేపీకి రాజీనామా చేశా. 2025 డిసెంబర్ నెలలోనే అధిష్ఠానానికి రాజీనామా గురించి చెప్పా. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీలో ఉన్నా'అని అన్నారు. 'ఈ సమయంలో తమిళనాడుకు కొత్త పార్టీ అవసరమా అని అడిగితే.. కచ్చితంగా అవసరమే అని అన్నామలై అన్నారు. ఓ షాపునకు వెళ్లి టూత్‌పేస్టో.. బియ్యమో.. కందిపప్పో కొంటున్నపుడు పది షాపులు తిరుగుతాము. రేటు, నాణ్యత చెక్ చేసి కొంటాం. ఎందుకంటే అవి మన శరీరంలోకి పోయేవి. ఇప్పుడు ఎన్ని పార్టీలు ఉన్నా కూడా పార్టీ నాయకుడు ఎలాంటి వాడో ప్రజలు చూస్తారు. పక్కంటి వాళ్లను చూసినట్లే ప్రజలు మమ్మల్ని చూడబోతున్నారు. దూరం నుంచి ప్రజలకు అభివాదం చేసే రాజకీయాలకు మేము దూరం. కల్ట్ పాలిటిక్స్ నుంచి బయటకు రావాలి. రాజకీయాలను మారుస్తాం అంటున్నారు.. మళ్లీ అదే కల్ట్ పాలిటిక్స్ చేస్తున్నారు. కామన్ మ్యాన్ పాలిటిక్స్ ముందుకు తీసుకురావాలనుకుంటున్నా. కేవలం ముఖ్యమంత్రి కారణంగా మార్పు సాధ్యం కాదు. సర్పంచ్ దగ్గరి నుంచి ముఖ్యమంత్రి వరకు అందరూ నిబద్ధత కలిగిన వాళ్లు ఉంటేనే మార్పు సాధ్యం అవుతుందని అన్నామలై అన్నారు. ఈసందర్భంగా ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రస్తావన తెచ్చారు. తనతో చేతులు కలపమని గతంలో సూపర్‌స్టార్ అడిగారన్నారు. 2024లో తాను భాజపాలో చేరడానికి ఒకరోజు ముందు రజనీకాంత్ నాకు ఫోన్ చేశారు. ఆయన నేతృత్వం వహిస్తున్న రాజకీయ ఉద్యమంలోకి రావాలని ఆహ్వానించారు. కానీ, నేను అప్పటికే భాజపా సీనియర్ నేత బీఎల్ సంతోష్‌కు మాటిచ్చా. అందుకే రజనీ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించా. నేను రాజకీయాల్లో కి రావడానికి కారణం బీఎల్ సంతోష్ ఇచ్చిన హామీనే. నా రాజకీయ ప్రవేశంపై ఉన్న ఊహాగానాలకు ముగింపు పలికేం దుకు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాను. అయితే తమిళనాడు విషయంలో నా అభిప్రాయాలు.. భాజపా నాయకత్వం అభిప్రాయాలతో సరిపోలలేదు. ఈ విభేదాలను పరిష్కరించు కునేందుకు పార్టీ అగ్రనాయకత్వంతో 18 నెలలుగా ఎన్నో చర్చలు జరిపాను. ఇంక భాజపాకు భారంగా ఉండకూడదని అనుకున్నాను' అని అన్నామలై వివరించారు. ఇకపై స్వతంత్ర రాజకీయ మార్గంలో ముందుకువెళ్తానని, తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త బాటలు వేసేందుకు పోరాడతానని తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లోనే నా రాజీనామా గురించి చెప్పాను. అయితే పార్టీ పెద్దలు నన్ను ఆపారు. ఎన్నికల బాధ్యతలు నిర్వహించమని సూచించారు. ఇప్పుడు నా రాజకీయాలు సామాన్యుడి లక్ష్యంగా ఉంటాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సొంతంగా పోటీ చేస్తాను. అప్పటివరకు అందరినీ ఏకతాటిపైకి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నిస్తాను. అలాగే అన్నామలై మక్కల్ ఇయక్కమ్ పేరిట రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. దానికి భారీ స్పందన వస్తోందని చెప్పారు.

## కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం

- శోకం మిగిల్చిన ఎల్లమ్మ పండగ వేడుక
- మంజీరాలో ఈతకు వెళ్లి నలుగురు మృత్యువాత

**కామారెడ్డి, జూన్ 5 :** కామారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగిన నలుగురు ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టగా.. ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం మంగల్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది బాన్సువాడ మండలం బుడిమి శివారులోని మంజీరా నది వద్ద ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చారు. వీరిలో భానుప్రసాద్, అనిత, పావని , శివాని నదిలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో నదిలో నలుగురూ గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టి భానుప్రసాద్‌ను రక్షించారు. మిగిలిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మంజీరా నదిలో ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు నీట మునిగి మృత్యువాత పడ్డారు. బొల్లాక్‌పల్లి సమీపంలోని మంజీరా నదిలో అనిత, పావని, శ్రీవాణి, భాను ఈతకు దిగారు. వీరంతా నదిలో ఊబిలో చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని గమనించిన సమీపంలోని ఒక మహిళ వారిని రక్షించే ప్రయత్నం చేసి తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే ఆమెను రక్షించారు. అలాగే ఊబిలో చిక్కుకున్న మృతదేహాలను స్థానికుల సహాయంతో బయటకు తీశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు బొల్లాక్‌పల్లికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం బాన్సువాడ మండలం బుడిమి గ్రామం వద్ద ఎల్లమ్మ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు పాల్గొన్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేడుక జరిగింది. అనంతరం భోజనాలు చేసిన తర్వాత నలుగురు చిన్నారులు మంజీరా నదిలో ఈత కొట్టేందుకు వెళ్లి.. ఊబిలో చిక్కుకుని మరణించారని పోలీసులు చెప్పారు. వీరంతా 10 ఏళ్ల లోపు వారేనని తెలిపారు. చిన్నారుల మృతితో వారి తల్లిదండ్రులతోపాటు బంధువుల రోదనలు మిన్నంటాయి.

## బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

## స్పా సెంటర్లలో అసాంఘీక కార్యకలాపాలు

### మల్కాజిగికి ప్రాంతంలో ఏకకాలంలో దాడులు

### 113 స్పా సెంటర్లపై పోలీసుల తనిఖీలు

**హైదరాబాద్, జూన్ 5 :** నగరంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పలు స్పా సెంటర్లపై పోలీస్ బృందాలు శుక్రవారం ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించాయి. దాదాపు 500 మంది పోలీసులు.. బృందాలుగా ఏర్పడి 113 స్పా సెంటర్లపై ముకుమ్మడిగా తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలు స్పా సెంటర్లలో అక్రమాలతోపాటు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. కస్టమర్లకు సంబంధించిన డేటా రిజిస్టర్‌ను సైతం స్పా సెంటర్ నిర్వాహకులు మెయింటెయిన్ చేయడం లేదని గుర్తించారు. అలాగే స్పా సెంటర్లకు రెంటుకు ఇస్తున్న ఓనర్లను కూడా ఈ సందర్భంగా పోలీసులు విచారించారు. స్పా సెంటర్ల నుంచి రెంట్ తీసుకోవడం తప్ప.. అందులో ఏం జరుగుతుందో కూడా ఓనర్లు పట్టించుకోవడం లేదని పోలీసుల విచారణలో బహిర్గతమైంది. కొన్ని స్పా సెంటర్లలో అక్రమాలు జరుగుతున్నాయని గుర్తించి కూడా.. ఇంటి ఓనర్లు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని పోలీసులు గుర్తించారు. నగరంలోని స్పా సెంటర్ల భారీగా ఉన్నాయి. వీటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ అడపాదడపా పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఆయా ఫిర్యాదుల మేరకు పోలీసులు దాడులు చేస్తున్నారు. సందర్భంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కానీ నగరంలో ఒకే సారి భారీగా స్పా సెంటర్లపై పోలీసులు ఏకకాలంలో దాడులు చేయడం ఇదే ప్రథమం. అలాగే స్పా సెంటర్ల నిర్వహణ విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలని.. పోలీస్ ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు. స్పా ముసుగులో అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా.. వీటికి అడ్డుకట్ట వేయవచ్చని పోలీసులకు ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# నీ పదేళ్ల పాలన.. నా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దామా?

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండి
- ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతాం
- ఎంపిగా గెలిపిస్తే పాలమూరు ఒరగబెట్టిందేమీ లేదు
- మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటా
- నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణ మా లక్ష్యం
- జడ్చర్ల సభలో కేసీఆర్‌కు సిఎం రేవంత్ సవాల్



**జడ్చర్ల, జూన్ 5 :** నీ పదేళ్ల పాలన.. నా రెండున్నరేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా? అంటూ కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా.. ఈ చర్చలో ఓడితే తాను దేనికైనా సిద్ధమని కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం జడ్చర్ల పరజాపాలన-ప్రగతి ప్రణాళిక సభ వేదికపై నుంచి నిప్పులు చెరిగారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండని కేసీఆర్‌కు సీఎం రేవంత్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతామన్నారు. మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. రాసి పెట్టుకో కేసీఆర్.. పాలమూరులో మీ జెండా ఎగరనివ్వమని హెచ్చరించారు. పాలమూరు ప్రాజెక్టుకు డిసెంబర్‌లోగా 90 టీఎంసీలు నీటిని సాధిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. నీటి సమస్యలపై పక్క రాష్ట్రాలతో చర్చలు వద్దా? అని కేసీఆర్ తీరును ఎండగట్టారు. తాను చర్చలు చేస్తానంటే బురద జల్లుతున్నారని మండిపడ్డారు. ఏపీతో చర్చలు జరుపుతామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణలో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణెళి తన లక్ష్యమని సీఎం రేవంత్ ప్రకటించారు. వలసలు, ఆత్మహత్యల కష్టనష్టాలు మనకు తెలుసునన్నారు. కేసీఆర్ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన కేసీఆర్‌ను గెలిపించారని వివరించారు. ఎంపీగా గెలిచిన కేసీఆర్ కనీసం ప్రజలను కలవడానికి కూడా రాలేదన్నారు. కష్టకాలంలో ఆదుకున్న పాలమూరును కేసీఆర్ పట్టించుకోలేదని చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు కేసీఆర్ ఎన్నో హామీలు ఇచ్చారు కానీ కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. పాలమూరు నుంచి పారిపోయిన కేసీఆర్ ద్రోహి అవుతారా? లేక నేనా? అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదంటూ కేసీఆర్‌పై మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు పాదయాత్ర చేస్తామంటున్నారని సీఎం రేవంత్ వ్యంగ్యంగా అన్నారు. కాశీ వరకు పొర్లు దండాలు చేసినా మీ పాపాలను ఎవరూ మరిచిపోరని ఆ పార్టీ నేతలకు స్పష్టం చేశారు. కేసీఆర్ ఎప్పుడైనా రైతుల కష్టాల గురించి ఆరా తీశారా? అని ప్రశ్నించారు. మేక వన్నె పులిలాంటి కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ నమ్మరని పేర్కొన్నారు. కేసీఆర్ తర్వాత ఆయన కొడుకు, మనవడు రాజ్యాలు ఏలుతారా? అని నిలదీశారు. నాడు మిడ్జిల్ నుంచి తాను జెడ్పీటీసిగా గెలిచానని గుర్తు చేశారు. 2006లో మీరు నాటిన మొక్కే ఇప్పుడు వృక్షమై మీ ముందుందని ప్రజలను ఉద్దేశించి సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. నాడు మీరు గెలిపించిన ఈ జెడ్పీటిసి ఇప్పుడు రాష్ట్రానికి సీఎం అయ్యారని వివరించారు. కేసీఆర్ కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే మనవాళ్లే ఉండాలన్నారు. ఆత్మగౌరవంతో బతకాలంటే ఇందిరమ్మ ఇల్లు ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదన్నారు. బీఆర్ఎస్ నేతలవి నోరు తెరిస్తే అన్నీ అబద్దాలేనని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. దళితులకు 3 ఎకరాలు ఇస్తామని చెప్పి దగా చేశారన్నారు. కేజీ టు పీజీ విద్య హామీ ఎక్కడికి పోయిందని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇకపై పాలమూరు గడ్డపై బీఆర్ఎస్ గుర్తు మాయమని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. మీ పాలమూరు బిడ్డగా రెండురోజులుగా జిల్లా రైతులకోసం సాగునీరు ప్రాజెక్టులను పరిశీలించానన్నారు. వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు మనకు తెలుసని అన్నారు. పాలమూరులో ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరు లేకపోయినా ఇక్కడికి రాజకీయంగా వలసవచ్చిన కేసీఆర్ ను ఇక్కడి ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. కేసీఆర్ మేకవన్నె పులి అని గుర్తించక ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణకు రెండుసార్లు ముఖ్యమంత్రిని చేస్తే.. పదేళ్లలో పాలమూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. పాలమూరులో గెలిపిస్తే పారిపోయి గజ్వేల్ లో పోటీ చేసిన కేసీఆర్ పాలమూరు ద్రోహినా? నేను పాలమూరు ద్రోహినా అంటూ నిలదీసారు. పాలమూరు జిల్లాలో 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో పని చేస్తున్నాం. మీ పాలమూరు బిడ్డగా జిల్లాలో ప్రాజెక్టుల కోసం ఈ 30 నెలల్లో 8 వేల కోట్లు ఖర్చు చేశా. జైళ్లు కట్టాలని వాళ్లు అనుకుంటే స్కూళ్లు కట్టాలని మనం అనుకున్నాం. ఏం చదవాలన్నా పాలమూరు జిల్లాకు వచ్చేలా కొడంగల్ లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నాం. చదువొక్కటే మీ జీవితాల్లో వెలుగు నింపుతుంది.. పిల్లల్ని చదివించండి? చదువుకుంటేనే బతుకులు బాగుపడతాయి జిల్లాల్లో వలసలు ఆగాలన్నా, రైతులు సంతోషంగా ఉండాలన్నా పాలమూరు జిల్లా ప్రాజెక్టులు పూర్తి కావాలన్నారు. పాలమూరు ప్రజలు మట్టి తీసుడే కాదు? మట్టితో కప్పడం కూడా తెలుసన్నారు. రేవంత్ రెడ్డి ఏం చేసిండని కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారు. 15 లక్షల రేషన్ కార్డులు అందించాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాం. పది వేల కోట్లు మహిళలకి ఉచిత బస్సు ప్రయాణానికిఖర్చు చేశాం ఇలా మేం చేసింది చెప్పాలంటే రాస్తే రామాయణం.. చెబితే భారతం . మీ పదేళ్ల పాలనపై, మా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దాం.. కేసీఆర్ అసెంబ్లీకి రా అంటూ సవాల్ చేశారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరు చేసే బాధ్యత నాదని అన్నారు. 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని, 2029 లో కాంగ్రెస్ ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి,స్థానిక ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షలో మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, జూన్ 5 :** కోట్ల రూపాయిల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలో ఎల్ఐజీ, ఎంఐజీ వర్గాలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు ఇంటి స్థలంలో యాజమాన్య హక్కులు కల్పిస్తామన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3.50 లక్షల ఇళ్లకు పరిపాలనా అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు నిర్మిస్తామని వివరించారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విధానంపై ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. పేదల సంక్షేమం కోసం విలువైన ప్రభుత్వ భూముల వినియోగిస్తామని చెప్పారు. కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన జీవితమే లక్ష్యంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



## తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు

- దారులు చూపుతున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు
- మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, జూన్ 5 :** ప్రపంచ ఉద్యోగ విపణిలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా తెలంగాణ యువతను సిద్ధం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ పారిశ్రామిక శిక్షణా సంస్థలను (ఐటీఐలు) అత్యాధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) తీర్చిదిద్దిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు మరియు భూగర్భ వనరుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ కేంద్రాలు కేవలం శిక్షణా సంస్థలుగానే కాకుండా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మరియు అంతర్జాతీయ కెరీర్‌లకు ద్వారాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. మల్లేపల్లి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను మీడియా ప్రతినిధులతో కలిసి సందర్శించిన అనంతరం మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ట్రైనర్లు ఏటీసీల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ఆధునిక యంత్రాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను ప్రదర్శించారు. -రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) భాగస్వామ్యంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీలు) ఏర్పాటుకు సుమారు రూ.4,000 కోట్ల విలువైన అత్యాధునిక సాంకేతిక మౌలిక సదుపాయాలు, శిక్షణా వనరులను సమకూర్చింది. టీసీల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం స్టైపెండ్లు కూడా అందజేస్తోందని, ఆర్థిక ఇబ్బందులు ఆధునిక నైపుణ్యాల సాధనకు అడ్డంకిగా మారకుండా చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలకు అనుగుణంగా శిక్షణా సంస్థలను ఆధునీకరించడం ద్వారా భవిష్యత్ పరిశ్రమల అవసరాలను తీర్చగల అత్యున్నత నైపుణ్యాలున్న మానవ వనరులు సిద్ధమవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం తెలంగాణ యువత ఉపాధి అవకాశాలను పెంపొందించడమే కాకుండా రాష్ట్రాన్ని దేశంలోనే నైపుణ్యాభివృద్ధి రంగంలో అగ్రగామిగా నిలబెడుతుందని అన్నారు. ఐటీఐల మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు శిక్షకులు, బోధకులకు కూడా విస్తృత స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తద్వారా విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నాణ్యమైన విద్య, ప్రాక్టికల్ శిక్షణ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నైపుణ్యవంతమైన మానవ వనరులను తీర్చిదిద్దడంలో ఏటీసీలు కీలక పాత్ర పోషిస్తాయని, తెలంగాణను దేశంలో ప్రముఖ నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా నిలబెట్టడంలో ఇవి మైలురాయిగా మారతాయని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. సందర్భంగా మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో ప్రత్యేక ఫోటో ప్రదర్శనతో పాటు సాంకేతిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అసోంలో మంత్రివర్గ విస్తరణ

### కొత్తగా 12మంది మంత్రులుగా ప్రమాణం

**గువాహటి, జూన్ 5 :** అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ తన మంత్రివర్గాన్ని శుక్రవారంనాడు విస్తరించారు. కొత్తగా 12 మంది ఎన్డీయే ఎమ్మెల్యేలకు చోటు కల్పించారు. గువాహటిలోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్త మంత్రులతో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ప్రమాణ-స్వీకారం చేయించారు. తాజా విస్తరణతో ముఖ్యమంత్రితో కలిపి మంత్రి మండలి సభ్యులసంఖ్య 17కు చేరింది. కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రుల్లో అశ్విని రాయ్ సర్కార్, అశోక్ సంఘాల్, బిమల్ బోరా, బిశ్వజిత్ డైమరీ, జయంత మల్లా బరువా, కౌశిక్ రాయ్, కేషబ్ మహంతా, కి?ష్ణేందు పాల్, నీలిమా దేవి, పిజుష్ హజారికా, రనోజ్ పెగు, సుశాంత బోర్గో హైన్ ఉన్నారు. బిన్న భాషా సమ్మేళనంగా ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. మంత్రులు వివిధ భాషల్లో ప్రమాణస్వీకారం చేశారు. అస్సామీలో పలువురు ప్రమాణం చేయగా, బిమల్ బోరా సంస్కృతంలో, కౌశిక్ రాయ్ హిందీలో, కృష్ణేందు పాల్ బెంగాలీలో ప్రమాణం చేశారు. స్వాంకు వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ మే 12న ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ నేతలు అజంతా నియోగ్, రామేశ్వర్ తేలి, అసోం గణపరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) నేత చరణ్ బోరో మంత్రులుగా ప్రమాణం చేశారు. ఖనకపురలోని వెటర్నరీ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. 129 మంది సభ్యుల అసెంబ్లీలో ముఖ్యమంత్రితో సహా 19 మంది మంత్రులకు మంత్రివర్గంలో అవకాశం ఉంది.

## కల్తీ పదార్థాలతో చాక్లెట్ల తయారీ

**హైదరాబాద్, జూన్ 5 :** మహానగరంలోని కల్తీ చాక్లెట్ల తయారీ గుట్టును హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ అండ్ సేఫ్టీ టీమ్ రట్టు చేసింది. సీతారాంబాగ్ ప్రాంతంలో విగ్నెట్ ఫుడ్ స్పెషాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై హెచ్ ఫాస్ట్ టీమ్ దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా గడువు ముగిసిన రసాయన పదార్థాలతో కల్తీ చాక్లెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించింది. అందుకు సంబంధించి కార్తీక్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసింది. ఈ సంస్థలో రసాయన పదార్థాలతో కల్తీ చాక్లెట్లు తయారు చేస్తున్నట్లు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ అండ్ సేఫ్టీ టీమ్‌కు సమాచారం అందింది. దీంతో ఈ సంస్థపై సదరు టీమ్ దాడి చేసింది.

## భూమి కొలతల కోసం లంచం డిమాండ్

### ఏసీబీకి చిక్కిన మండల సర్వేయర్

**కరీంనగర్, జూన్ 5 :** భూమి కొలతల కోసం లంచం తీసుకున్న మండల సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విడతల వారిగా బాధితుడు నుంచి రూ. 25 వేలు తీసుకున్న మండల సర్వేయర్ ఎక్కలదేవి కుమార స్వామితో పాటు, మరో ఇద్దరు ప్రైవేట్ సర్వేయర్లు తీగల రాజేశ్, వంగ విహిత్ రెడ్డిని పట్టుకున్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం అమ్మన్‌గుర్తి గ్రామానికి చెందిన బాధితుడు తన భూమికి సంబంధించిన సర్వే చేయాలని సంప్రదించగా గత మే నెల నుంచి మూడు విడతలుగా మండల సర్వేయర్ లంచం తీసుకున్నాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టు ఎదుట హాజరు పరిచామని ఏసీబీ అధికారులు వివరించారు.

## కోహెడ పండ్ల మార్కెట్‌కు నేడు సిఎం శంకుస్థాపన

### శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జూన్ 5 :** తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ రంగ చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలవనున్న కోహెడా అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణానికి శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో శంకుస్థాపన ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రూ.3,367.35 కోట్ల వ్యయంతో 239 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న కోహెడా అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకోనున్నదని తెలిపారు. రైతు సంక్షేమం, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, ఆధునిక మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రైతు పండించిన ప్రతి ఉత్పత్తికి మార్కెట్ హామీ కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తుల విలువను పెంచడం, రైతుల ఆదాయాన్ని వృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు.

## తిరుమలలో ఏఐ ఆధారిత సేవలు భేష్

### టిటిడిని అభినందించిన మంత్రి పీయూష్ గోయల్

**తిరుమల, జూన్ 5 :** తిరుమలలో భక్తుల సౌకర్యార్థం కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరు ప్రశంసనీయమని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు. శుక్రవారం ఆయన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించగా, తితిదే ఈవో ఎం.రవిచంద్ర శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆయన ఆలయం ఎదుట మీడియాతో మాట్లాడుతూ, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ద్వారా వసతి గదుల ఆక్యుపెన్సీ వివరాలు, భక్తుల రాకపోకలు, దర్శన క్యూ లైన్లు, లడ్డూ ప్రసాదాల పంపిణీ వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రం ద్వారా గదుల లభ్యత, వివిధ కంపాటమెంట్లలో వేచి ఉన్న భక్తుల సంఖ్య, గంటల వారీగా తిరుమలకు చేరుకుంటున్న భక్తుల వివరాలు, లడ్డూ ప్రసాదాల పంపిణీ సమాచారం తక్షణమే అందుబాటులోకి వస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సాంకేతికతను ప్రోత్సహిస్తూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన ప్రవాస భారతీ-య భక్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, కేవలం 100 రోజుల్లోపే ఏఐ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిన తితిదే అధికారులను అభినందించారు. అంతకుముందు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమలలో తన తల్లి పేరిట మొక్క నాటారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తితిదే అదనపు ఈవో సిహెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీ కృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం అధికారులు పాల్గొన్నారు.

## అసమ్మతికి కళ్లెం వేసే యత్నం

### లోక్‌సభకు పోటీ చేసే యోచనలో మమత



**కోల్‌కతా, జూన్ 5 :** తృణమూల్ కాంగ్రెస్‌కు లోక్‌సభలోనూ అసమ్మతి పెరుగుతున్న సంకేతాలు వెలువడుతుండటంపై ఆ పార్టీ సుప్రీం మమతా బెనర్జీ లోక్‌సభకు పోటీ చేసే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది. ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో టీఎంసీ ఓటమి పాలై అధికారం కోల్పోయింది. 80 సీట్లు గెలుచుకుని ప్రతిపక్షానికే పరమితమైంది. ఈ నేపథ్యంలో లోక్‌సభకు పోటీ చేసే ఆలోచనలో మమతాబెనర్జీ ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. బహరాంపుర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మమతా బెనర్జీ పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నియోజకవర్గానికి ప్రస్తుతం టీఎంసీ ఎంపీ యూసఫ్ పఠాన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారురు. ఆయనను రాజీనామా చేసి మమత పోటీకి మార్గం సుగమం చేయాలని కోరనున్నట్టు తెలుస్తోంది. 2011 ప్రపంచ కప్ విన్నింగ్ స్క్వాడ్‌లో ఒకరైన భారత మాజీ క్రికెటర్ పఠాన్ 2024 పార్లమెంటు ఎన్నికల్లో బహరాంపుర్ నుంచి గెలిచారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత అధీర్ రంజన్ చౌదరిపై 85,000 ఓట్ల ఆధిక్యంతో పఠాన్ గెలుపొందారు. మమతా బెనర్జీ గతంలోనూ లోక్‌సభ సభ్యురాలిగా ఉన్నారు. కోల్‌కతా సౌత్ నుంచి ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. అయితే తొలి ఎన్నిక మాత్రం జాదవ్‌పుర్ నియోజకవర్గం నుంచి సీపీఐ అగ్రనేత సోమనాథ్ ఛటర్జీపై పోటీ చేసి గెలుపొందారు. 2011లో బెంగాల్ అసెంబ్లీకి వెళ్లేంతవరకూ లోక్‌సభ సభ్యురాలిగానే ఆమె ఉన్నారు. రైల్వేమంత్రిగానూ పనిచేశారు. ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘనవిజయం సాధించింది. కాగా, ఇటీవల కాలంలో పార్టీ నాయకత్వం పనితీరుపై లోక్‌సభ టీఎంసీ సీనియర్ ఎంపీల్లో అసమ్మతి తలెత్తెది. కొందరు పార్టీ వీడే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. మమతకు సన్నిహితురాలిగా పేరున్న పార్టీ సీనియర్ ఎంపీ కాకోలి ఘోష్ దస్తిదార్ బహిరంగంగానే ఇటీవల తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. బరాసత్ నుంచి నాలుగు సార్లు ఎంపీగా ఉన్న ఆమె లోక్‌సభలో తనపై అనుచితంగా మాట్లాడుతున్నారంటూ టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు ఫిర్యాదు చేశారు. పార్టీ పనితీరును ప్రశ్నించిన సీనియర్ ఎంపీల్లో సుఖేందు శేఖర్ రాయ్, శాంతను సేన్ సైతం ఉన్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో తిరుగుబాటును టీఎంసీ ఎదుర్కొంటోంది. టీఎంసీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా పార్టీకి చెందిన 57 మంది ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. స్పీకర్ రతీంద్ర బోస్ కూడా ఈ నియామకాన్ని గుర్తించారు. ఈ క్రమంలో ముందుగా లోక్‌సభలో అసమ్మతికి క్లళెం వేసేందుకు సభలో అడుగుపెట్టాలనే ఆలోచనలో మమతా బెనర్జీ ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



## కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో జలహక్కులు

### సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్, జూన్ 5 :** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని మాజీ మంత్రి, బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చోటుచేసుకుందని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ 74 శాతం వినియోగిస్తుంటే.. తెలంగాణ 25 శాతానికి పరిమితమైందని లేఖలో తెలిపారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రమాదంలో పడేసిందని మాజీ మంత్రి విమర్శించారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలు సాగునీటి రంగానికి ముప్పుగా మారాయని లేఖలో స్పష్టం చేశారు. అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను సమర్థంగా కాపాడాలని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# ఏటేటా పెరుగుతున్న పర్యావరణ విధ్వంసం!



**ఏటా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నా..మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏటా జూన్ 5న మొక్కలు నాటడం, ఫోటలకు పోజులు ఇవ్వడం, సైకిల్ తొక్కడం వంటివన్నీ చేస్తున్న పాలకులు చిత్తశుద్ధితో పర్యావరణ పరిరక్షణ చర్యలకు పూనుకోవడం లేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమిచకపోవడం వల్ల ఎల్‌నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఈ యేడు కూడా నైరుతి ఆలస్యంగా ప్రవేశించింది. ఇంకా ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఒకప్పుడు జూన్ మాసం వచ్చే వరకు జోరు వర్షాలు పడేవి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు. పెరుగుతన్న జనాభే పర్యావరణ విధ్వంసానికి మొదటి చేటుగా గుర్తిచాలి.**

పెరిగన జనాభా తమ అవసరాల కోసం పర్యవరణ విధ్వంసానికి పాల్పడుతోంది. దీనికి పాలకులే బాధ్యత వహించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను,మట్టిని తోడస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు. నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేక పోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జానావాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పంచభూతాలను రక్షించుకోవడం అన్నది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యావరణం. ఈ రెండింటినీ కూడా భగవంతుడే సృష్టించాడు. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవడం లేదు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది. అందుకే నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి,రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియ చేస్తున్నాయి.

భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపం గా భావించారు. నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది. భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్నీ, మనపరిసరాలనూ, చెట్టూ,పుట్టా, గాలీ, నీరు, కొండాకోనా, వాగూవంకా,పిట్టాపిచికా, అన్నిటినీ రక్షించుకోవడం అన్న అర్థంలో చెప్పారు. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీసు కుంటూ వస్తున్నారు. ఏది చేసినా ఆలోచన చేయడం లేదు. పాలకుల విధ్వంసకర విధానాలవల్ల భారతదేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడం లేదు. జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగృతపరిచే ప్రయత్నాలు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ సమ్మేళనం ఒకటి నిర్వహించింది. అన్ని దేశాలను ఆహ్వానించింది. స్వీడన్ లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సుమారు 119 దేశాలు పాల్గొన్నాయి. అలా ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడం అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీనివల్ల కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి.

భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు.నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రజలు అంతకు మించి అన్నట్లు మిన్నకుంటున్నారు. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నదుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వాటిని సంరక్షించుకోవాలి. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. మనకు జీవితాన్ని ప్రసాదించి, జీవనం కోసం ఉపయోగ పడుతున్న భూమిని తన స్వార్థ ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు. గృహ వ్యర్థాలు, చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బతింటోంది. మన దేశంలో ప్రతి రోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకు భూమిలో నాశనం కాకుండా నిల్వ ఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశుపక్ష్యాదులు వీటిని తినడం వల్ల చనిపోతున్నాయి. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ప్రమాదం. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు పాలుపడాల్సిన అవసరం ఉంది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

## 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730



**న్యూఢిల్లీ, జూన్ 5 :** భారత్‌లో బంగారం ధరల్లో పతనం కొనసాగు తోంది. గత రెండు రోజులుగా తగ్గిన బంగారం ధరలో శుక్రవారం కూడా స్వల్ప స్థాయిలో కొత పడింది. అయితే, కొన్ని రోజులుగా స్థిరంగా ఉంటున్న వెండి ధర మాత్రం తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.30 గంటల సమయం లో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730కు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధరలో రూ.380ల మేర కోత పడింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.350ల మేర తగ్గి రూ.1,42,750కు చేరుకుంది. ఇక నగరంలో కిలో వెండి ధరలో రూ.5 వేల మేర కోత పడింది. ప్రస్తుతం కిలో వెండి రూ.2.8 లక్షలుగా ఉంది. విజయవాడలో కూడా దాదాపు ఇవే రేట్స్ ఉన్నాయి. ఇక దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర సగటున రూ.350ల మేర తగ్గింది. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,57,960గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,300గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,730గా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,42,750గా ఉంది. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,55,880గా, 10 గ్రాముల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,42,900గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ల పసిడి ధర 4,444 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ నేపథ్యంలో కొత్త పెట్టుబడు ల విషయంలో మదుపరులు వేచి చూసే ధోరణిని ప్రదర్శిస్తు న్నారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు బుధవారం రూ.5,616.56 కోట్లు, గురువారం రూ.4,447.06 కోట్ల నికర విక్రయాలు జరిపారు. డాలర్‌తో రూపాయి మారకం విలువ 2 పైసలు పెరిగి రూ.95.74 వద్ద ముగిసింది. అంత ర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒకదశలో 2.5 శాతానికి పైగా తగ్గి 95.33 డాలర్లకు దిగివచ్చింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.700 పెరిగి రూ.1,60,300 పలకగా.. కిలో వెండి రూ.3,800 తగ్గుదలతో రూ.2,65,700కు దిగివచ్చింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 4,472 డాలర్లు, సిల్వర్ 73.56 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

# మాజీ ప్రియురాలి దారుణ హత్య

- 20 సార్లు కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన ప్రేమోన్మాది
- అనంతరం అదే కత్తితో పొడుచుకున్న దుండగుడు
- యువతి మృతి.. యువకుడి పరిస్థితి విషమం



**చండీఘడ్, జూన్ 5 :** పంజాబ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ యువతి మాజీ ప్రియుడి చేతిలో దారుణ హత్యకు గురైంది. మాజీ ప్రియుడు ఆ యువతిని 20 సార్లు కత్తితో పొడిచి చంపాడు. యువతిని చంపిన తర్వాత అదే కత్తితో తనను తాను పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గురువారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మొహాలికి చెందిన హర్విందర్ మన్ అలియాస్ హ్యారీ, డింపుల్ మూడేళ్ల క్రితం ఓ కంపెనీలో కలిసి పని చేశారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరి మధ్యా పరిచయం ఏర్పడింది. పరిచయం ప్రేమగా మారింది. కొన్ని నెలల క్రితం ఇద్దరూ కొత్త కంపెనీలో చేరారు. కొత్త కంపెనీలో చేరిన కొంతకాలం వీరి బంధం సజావుగానే సాగింది. తర్వాత నుంచి గొడవలు మొదలయ్యాయి. కొద్దిరోజుల క్రితం ఇద్దరూ విడిపోయారు. డింపుల్‌తో విడిపోవటం హ్యారీకి ఇష్టం లేదు. మళ్లీ ఆమెతో ఒక్కడవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. డింపుల్ ఇందుకు ఒప్పుకోవటం లేదు. దీంతో అతడు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. గురువారం డింపుల్ డ్యూటీలో ఉండగా.. రాత్రి 7.40 గంటల ప్రాంతంలో హ్యారీ ఆఫీస్‌కు వచ్చాడు. ఆమెతో గొడవ పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలోనే కత్తితో డింపుల్‌ను 20 సార్లు అతి కిరాతకంగా పొడిచాడు. తర్వాత అదే కత్తితో తన గొంతులో 30 సార్లు పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. రక్తపు మడుగులో పడి ఉన్న ఇద్దరినీ సహోద్యోగులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించారు. డింపుల్‌ను పరీక్షించిన వైద్యులు ఆమె చనిపోయినట్లు ధ్రువీకరించారు. హ్యారీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలను అన్వేషిస్తున్నారు.



# వైభవంగా శ్రీకళ్యావణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

### శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహణ

**తిరుపతి, జూన్ 5 :** తిరుపతి సమీపంలోని నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం చక్రస్నానం వైభవోపేతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ దివ్య ఘట్టాన్ని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. అంతకుముందు ఉదయం 7 గంటల నుండి 8.15 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పుష్కరిణి సమీపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.15 గంటల నుండి 10.30 గంటల వరకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో జరిగిన అన్ని సేవలు సఫలమై, లోకక్షేమం, సకాల వర్షాలు, ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం చక్రస్నానం నిర్వహించినట్లు ఆగమ పండితులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొని చక్రస్నానాన్ని దర్శించిన భక్తులు సమస్త పాప విముక్తులై, ఐశ్వర్యాలు, ధనధాన్య సమృద్ధిని పొందుతారని విశ్వాసం. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహించి తొమ్మిది రోజుల పాటు వైభవంగా సాగిన బ్రహ్మోత్సవాలకు పూర్ణా హుతి పలుకనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూ టీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు నాగరాజు, చెంగల్రాయులు, అర్చ కులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి ఇంట్లో పేలిన సిలిండర్

### అమ్మమ్మతో పాటు ఇద్దరు మనువళ్ల మృతి

**నల్లగొండ, జూన్ 5 :** నల్లగొండ జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. మిర్యాలగూడలోని ఓ ఇంట్లో అర్ధరాత్రి సమయంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. మరణించిన వారిని అమ్మమ్మ వనం చంద్రకళ, మనుమడు లక్ష్మణ్ (16), మనమరాలు ప్రణతి(14)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడకు చెందిన చంద్రకళ, సైదులు భార్యభర్తలు. చంద్రకళ భర్త అనారోగ్యంతో కొన్ని రోజుల కిందటే మరణించాడు. ఇక చంద్రకళ పెద్ద కూతురు ధనమ్మ భర్త పదేళ్ల కిందట చనిపోయాడు. అప్పటి నుంచి తన ఇద్దరు పిల్లలు లక్ష్మణ్(16), ప్రణతి(14)తో పుట్టింట్లోనే ఉంటోంది. ఉపాధి నిమిత్తం ఇళ్లలో పనిచేసేందుకు ధనమ్మ మూడు రోజుల కిందట పుణెళికు వెళ్లింది. ఇదిలా ఉంటే.. గురువారం రాత్రి మనుమడు, మనుమరాలితో చంద్రకళ తమ రేకుల ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. విద్యుద్ఘాతం కారణంగా ఇంట్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

ఇది గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా.. భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే సజీవదహనం అయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం మృతదేహాలను వెలికితీశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఘటనాస్థలిని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. పూర్తిగా కాలిన మృతదేహాలను స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

# పర్యావరణంతో సంబంధం లేదని అనలేం

- పరిరక్షణ బాధ్యత అందరిదీ అని గుర్తించాలి
- కృష్ణకాంత్ పార్క్‌లో మొక్కలు నాటిని మంత్రి పొన్నం



**హైదరాబాద్, జూన్ 5 :** ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదని ఎవ్వరూ అనుకోవద్దని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారని.. ఈరోజు కూడా అది జ్ఞాపకం చేసుకుంటామని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్‌లో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజుల పాటు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఢిల్లీ కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. వాహనాల వాడకం వల్ల పొల్యూషన్‌ను తగ్గించి పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. భవిష్యత్తులో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని.. అందరూ నీటిని ఆదా చేయాలని సూచించారు. బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంట్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. ఎ÷-లాస్టిక్‌ను నియంత్రించాలని అన్నారు. భూమిలో కలిసి పోయే వ్యర్థాలను వాడితే మంచిదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫారెస్ట్ డిపా÷-టం÷-మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# పోలీసుల అదుపులో నేపాలీ గ్యాంగ్

### మల్కాజిగిరి చోరీ కేసులో పట్టివేత

**హైదరాబాద్, జూన్ 5 :** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మల్కాజిగిరి చోరీ కేసులో నేపాలీ గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత నెలలో మల్కాజిగిరి పరిధిలోని రిటైర్డ్ ప్రొఫెసర్ నివాసంలో నేపాలీ ముఠా భారీ చోరీకి తెగబడింది. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరు కీలక సూత్రధారులను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా మరో నలుగురిని పుణెలో అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరుగురు సభ్యులు పోలీసు కస్టడీలో ఉన్నారు. వీరిని ప్రస్తుతం పుణె నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు మల్కాజిగిరి పోలీసులు తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఇంట్లో రాత్రి సమయంలో చొరబడిన నేపాలీ గ్యాంగ్.. లక్షల రూపాయల విలువైన నగలు, నగదు, ఇతర వస్తువులను అపహరించింది. ఈ చోరీ హైదరాబాద్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. వెంటనే కేసు నమోదు చేసిన మల్కాజిగిరి పోలీసులు.. సీసీటీవీ ఫుటేజ్‌లు, సెల్‌ఫోన్ లొకేషన్ డేటా ఆధారంగా గ్యాంగ్‌ను ట్రాక్ చేశారు. నేపాలీ ముఠా దేశంలోని వివిధ నగరాల్లో చోరీలకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.



# తిరుమలలో మొక్క నాటిని కేంద్రమంత్రి పీయూష్ గోయల్

**తిరుమల, జూన్ 5 :** ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా తిరుమలలోని శ్రీకృష్ణ అతిథి గృహం వద్ద కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మొక్క నాటారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనం అద్భుతంగా జరిగిందన్నారు. ప్రతి ఏటా జూన్ మాసంలో పుట్టినరోజు సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ఆశీస్సులు పొందుతున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు తన తల్లి పేరిట తిరుమలలో మొక్క నాటడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు నేడు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. చిన్న పిల్లలు కూడా తమ తల్లి పేరిట ఒక మొక్క నాటాలన్నారు. తిరుమలలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ అద్భుతంగా ఉందని కేంద్ర మంత్రి కొనియాడారు.

# అమ్మ పేరు మీద ఒక చెట్టు నాటండి

## కేంద్ర ప్రభుత్వం దిగ్విజయంగా 12 సంవత్సరాలు పూర్తి

**నాగారం, జూన్ 5 (జనం వార్త) :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బిజెపి పార్టీ ఆధ్వర్యంలో "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని "అమ్మ పేరు మీద ఒక చెట్టు" అనేది పర్యావరణ పరిరక్షణకు ప్రోత్సహించడానికి సూచనగా నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి,భరత్ నగర్ లో మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ మాట్లాడుతూ భారత ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సుపరిపాలన అందిస్తూ చారిత్రాత్మకమైన నిర్ణయాలతో కేంద్ర ప్రభుత్వం దిగ్విజయంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ సెల్ కో-కన్వీనర్ మునిగంటి సురేష్, మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు గోనే శ్రీనివాస్, బుధవరం లక్ష్మి,జిల్లా ఉపాధ్యక్షులు గణపురం శ్యాంసుందర్ శర్మ, బొమ్మిడి బుచ్చిరెడ్డి , నాగారం డివిజన్ అధ్యక్షులు నాగరాజు, మాజీ ఎంపీటీసీ బలరాం,మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్, మహేందర్ గౌడ్,నక్క కిషోర్ గౌడ్,శ్రీనివాస్ రావు,బాలరాజ్ యాదవ్,మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, ఏనుగు మహేందర్ రెడ్డి,వల్లల శ్రీనివాస్ గౌడ్,రామారం గిరి గౌడ్,సురేందర్ రెడ్డి, సతీష్ రెడ్డి,మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## అంగన్వాడి కేంద్రంలో హెల్త్ క్యాంప్

### అభయ హెల్త్ కార్డును సద్వినియోగం చేసుకోండి: చంద్రారెడ్డి

**నాగారం, జూన్ 05 (జనం వార్త) :** ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నాగారం మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని వెస్ట్ గాంధీనగర్ కాలనీ అంగన్వాడి కేంద్రంలో హెల్త్ క్యాంప్‌లో భాగంగా అభయ హెల్త్ కార్డు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్,నక్క కిషోర్ గౌడ్, దయాకర్,డాక్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధరల పెరుగుదలపై రాజీలేని పోరాటం చేద్దాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 5 :** నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలపై రాజీలేని పోరాటం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. చుంచుపల్లి మండల విస్తృత కౌన్సిల్ సమావేశం శుక్రవారం బాబు క్యాంపు కార్యాలయం 'రజబ్ అలీ భవన్'లో జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాల ధరల భారంతో సామాన్య ప్రజలు బ్రతికే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై జూన్ 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ విస్తరణకు, స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.



## మృతురాలు వసుమతి కుటుంబానికి టిబిజికేఎస్ నేతల ప్రగాఢ సానుభూతి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 5:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం ఏరియా పి.వి.కె- ఫై ఇంక్లైన్ లో అప్రెంటిస్ గా చేస్తున్న గిరిజన బిడ్డ బీజ వసుమతి (23) బాబుక్యాంపులో తాను నివసిస్తున్నటువంటి ఇంట్లో పురుగుల మందు తాగి హాస్పటల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతి పట్ల తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నేతలు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ నేతలు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విశాల దృక్పథం తో సింగరేణిలో ఆడవారికి కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు. వసుమతి చావుకు కారకురాలైన వారిని ఎంతటి వారినైనా శిక్షించవలసిందిగా సింగరేణి యాజమాన్యాన్ని కోరుతున్నామని తెలిపారు. ఎన్నో ఆశలతో చదువుకొని అప్రెంటిస్ చేశాక ఉద్యోగం పొందాలనే ఆశతో సింగరేణిలో అప్రెంటిస్ గా జాయిన్ కావడం జరిగిందని, కొందరు వేధింపులకు గురి చేశారని వేధింపులు తాళలేక బలవన్ మరణం చేసుకోవడం బాధాకరమైన విషయం అని అన్నారు. వసుమతి కుటుంబానికి ఓదార్పుగా అప్రెంటిస్ట్ ట్రైన్ కి కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా యాజమాన్యం ప్రకటించవలసిందిగా టీబీజీకేఎస్ యూనియన్ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టీ.బీ.జీ.కే.ఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య,లీగల్ అడ్వైజర్ జీ.కే సంపత్,సంయుక్త కార్యదర్శి వసికర్ల కిరణ్ కుమార్,కేంద్ర కమిటీ సభ్యులు కాగితాపు విజయ్ కుమార్,ఎం.టెక్ మహేందర్, పీవీకే ఫిట్ సెక్రటరీ నమిల్ల వెంకటేశ్వర్లు, రవివర్మ తదితరుల నేతలు పాల్గొన్నారు.




## కొత్తగూడెం ఏరియాలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 5 :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం నందు పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ అటవీ శాఖ వారు కొత్తగూడెం ఏరియాలోని వి.కె. కోల్ మైన్‌లో హై డెన్సిటీ మిక్స్‌డ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ , జిల్లా ఎస్పీ బి రోహిత్ రాజు ,సింగరేణి సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్ వి సూర్య నారాయణ , డైరెక్టర్ (పీ అండ్ పీ) కె వెంకటేశ్వర్లు ,కొత్తగూడెం డిఎఫ్ఓ జి కిస్టా గౌడ్ , అడ్వైజరీ ఫారెస్ట్రీ మోహన్ చంద్రా పర్గైన్ కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం షాలేమ్ రాజు విచ్చేసి వికేసిఎం నందు మొక్కలు నాటరు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి విస్తృత స్థాయిలో మొక్కలు నాటడం అవసరమని తెలిపారు. నేడు నాటిన మొక్కలను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని అన్నారు. సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున హరితహారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, గనుల ప్రాంతాలను పచ్చదనంతో నింపేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నదని డైరెక్టర్ (పీ అండ్ పీ) కె వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతిఒక్కరు తమ భాద్యత గా భావించి పర్యావరణాన్ని పరిరక్షించినప్పుడే మన భావి తరాల వారు క్షేమంగా ఉండగలరని దానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు .కార్యక్రమంలో వివిధ రకాల స్థానిక మరియు పర్యావరణానికి అనుకూలమైన మొక్కలను నాటి, వాటి సంరక్షణకు అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం లో కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ వి. మల్లికార్జున్ రావు , ఐ.ఎన్.టి.యు.సి ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్ , ఉన్నతాధికారులు ,అటవీశాక అధికారులు, వికేసిఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు పాఠశాలల్లో 50 శాతం రాయితీ

- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు
- జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విధ్యను అందించాలని టీయూడబ్ల్యూజే -ఐజేయూ జిల్లా యూనిట్ అభ్యర్థన
- కలెక్టర్,డీఈఓ లకు ధన్యవాదాలు
- జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా



PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER
RANGA REDDY DISTRICT
Present: S. V[illegible], M.A., B.Ed.,

Proc. Rc. No. Spl/DEO-RR/2026 Date: 05-06-2026

Sub: School Education – Rang[illegible] District – Providing fee concession to the children of Working Journalists [illegible] in Private Unaided Schools – Orders issued for the academic year 2026–27– Reg.

Ref: Representation dated 04-06-2026 received from the Telangana State Union of Working Journalists, Rangareddy District Unit.

***

The Telangana State Union of Working Journalists, Rangareddy District Unit, in the reference cited, has submitted a representation requesting continuation of fee concession to the children of working journalists studying in Private Unaided Schools for the academic year 2026–27.

In this regard, it is informed that, as per the existing Government guidelines, working journalists are eligible for concession of up to 50% in school tuition fees for their children. The same shall be extended for the academic year 2026–27 also.

Accordingly, all the Private Unaided Schools functioning in Rangareddy District are hereby instructed to provide fee concession up to 50% to the children of working journalists serving in any part of Rangareddy District, subject to verification of valid accreditation cards issued by the Government of Telangana.

Further, all the Mandal Educational Officers are instructed to communicate these orders to all Private Unaided Schools under their jurisdiction and ensure strict implementation of the same.

District Educational Officer
Rangareddy District

OFFICE OF THE District Educational Officer
RANGA REDDY DIST.
Collectorate Complex,
Kongarakalan, IBP,
Ranga Reddy Dist-501 510.

To:
All the Private Unaided Schools functioning in Rangareddy District through the Mandal Educational Officers concerned.

Copy to:
- All Mandal Educational Officers in the District.
- Telangana State Union of Working Journalists, Rangareddy District Unit.



**శేరిలింగంపల్లి, జూన్ 05 (జనం వార్త) :** రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు పూర్తి రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూజే జిల్లా శాఖ తరుపున చేసిన వినతికి స్పందించిన డిఈఓ 50 శాతం రాయితీ ఇవ్వాలని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఏలక్ట్రానిక్, ప్రింట్ మీడియా లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రయివేటు పాఠశాలలో పిల్లల చదువులకు ఫీజులు భారంగా మారాయని జిల్లా కలెక్టర్ తో పాటు డిఈఓ దృష్టికి యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా తీసుకువెళ్లారు. ఈ మేరకు జిల్లా విద్యాధికారి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఉత్తర్వు కాపీలను డిఈఓ వెంకటేశ్వర్లు జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషా కు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణ రెడ్డి కి,అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి కి,డి ఈ ఓ వెంకటేశ్వర్లు కు జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషా ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆదేశాలు అన్ని పాఠశాలల్లో వర్తించేలా చూడాలని కోరారు. ఈ మేరకు ఆయా మండలాల ఎంఈఓ లకు కుడా సూచిస్తామని, ఉత్తర్వు కాపీలను పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు మారాటీ రవి,జర్నలిస్ట్ నేతలు కరుణాకర్,భాస్కర్ , భార్గవ్, శ్రీనివాస్,శివ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కో యువకుడు రెండు మొక్కలు నాటితేనే భవిష్యత్ తరాలకు పచ్చని భరోసా

- పర్యావరణ పరిరక్షణను ఉద్యమంగా మార్చాలని యువతకు పిలుపు
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలో అవగాహన ర్యాలీ, మొక్కలు నాటడం
- కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్‌కు చెట్ల పెంపకమే శాశ్వత పరిష్కారం
- కోడిరెక్క ఉమాశంకర్




**ఖమ్మం, జూన్ 5 :** ప్రపంచాన్ని వేధిస్తున్న వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గిపో తున్న అటవీ సంపద వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు యువత ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోడిరెక్క ఉమాశంకర్ పేర్కొన్నారు. పర్యావ రణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి యువకుడు తన జీవితంలో భాగంగా స్వీకరించాల్సిన సామాజిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మేర యువ భారత్ ఆధ్వర్యంలో, తెలంగాణ గ్రాడ్యుయే ట్స్ యూత్ అసోసియేషన్ సహకారంతో ఖమ్మం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగా హన కల్పించారు. మాట్లాడుతూ చెట్లు మానవ మనుగ డకు ప్రాణాధారమని, భూమిపై జీవజాలం మనుగడ కొనసాగాలంటే పచ్చదనాన్ని కాపాడుకోవడం తప్పనిసరి అని అన్నారు. చెట్లు వాతావరణంలో కార్బన్ డైఆక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేయడం ద్వారా జీవులకు ప్రాణవాయువును అందిస్తున్నాయని తెలిపారు. వర్షాల సమతుల్యత, భూగర్భ జలాల పరిరక్షణ, నేల సారవం తత పెంపు, ఉష్ణోగ్రతల నియంత్రణ వంటి అనేక ప్రయోజనాలు చెట్ల ద్వారానే సాధ్యమవుతాయని వివరిం చారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ వార్మింగ్ ప్రభావం తీవ్రంగా కనిపిస్తోందని, అధిక ఉష్ణోగ్రతలు, అనిశ్చిత వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను అధిగమించాలంటే ప్రతి వ్యక్తి సంవత్సరానికి కనీసం రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచిం చారు. మొక్కలు నాటడం కంటే వాటిని పెద్ద చెట్లుగా పెంచడం మరింత ముఖ్యమని అన్నారు. ఈ సందర్భం గా యువతతో కలిసి పది మొక్కలను నాటించి పర్యావ రణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించి ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పర్యావరణ అంశాలపై యువత రూపొందించిన పోస్టర్ పెయింటింగ్‌లను పరిశీలించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమ తులు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రాడ్యు యేట్స్ యూత్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గోగుల చంద్రశేఖర్ మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు ఆరోగ్యక రమైన జీవన వాతావరణాన్ని అందించాలంటే చెట్ల పెంపకాన్ని సామాజిక ఉద్యమంగా మార్చాల్సిన అవస రం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో యువత పాత్ర అత్యంత కీలకమని, గ్రామం నుంచి నగరం వరకు ప్రతి ప్రాంతంలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

### పొట్టి శ్రీరాములు రోడ్ విస్తరణ పేరిట

## ప్రజలకు నరకయాతన

- 10 నెలలుగా దుర్వాసన, ట్రాఫిక్ కష్టాలు
- బాధ్యులపై చర్యలు ఎప్పుడు?
- డ్రైనేజీలు ధ్వంసం చేసి వ్యాపారులను ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలు
- జిల్లా మంత్రి జోక్యం చేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు విజ్ఞప్తి



**ఖమ్మం, జూన్ 6 :** ఖమ్మం నగరంలోని 3 టౌన్ పరిధిలో ఉన్న ప్రధాన వాణిజ్య కేంద్రం పొట్టి శ్రీరాములు రోడ్ విస్తరణ పనులు స్థానిక వ్యాపారులకు వరంగా కాకుండా శాపంగా మారాయని మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు ఆరోపించారు. దాదాపు పది నెలలుగా కొనసాగుతున్న పనుల కారణంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న వందలాది వ్యాపార సంస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక అధికార పార్టీ నాయకుడు తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి రోడ్డుపై ఉన్న పెద్ద, చిన్న వ్యాపారులను పలుమార్లు సమావేశాలకు పిలిపించి, వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే చివరకు ప్రజల ప్రయోజనాల కంటే వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. రోడ్డు విస్తరణ పేరిట ప్రైవేట్ కాంట్రాక్టర్‌తో కలిసి మున్సిపల్ డ్రైనేజీ వ్యవస్థను ధ్వంసం చేయడం వల్ల ప్రస్తుతం మొత్తం ప్రాంతం మురుగు నీటితో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోందని ఆరోపించారు. వ్యాపార సంస్థల వద్దకు వచ్చే వినియోగదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో వ్యాపారాలు గణనీయంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.

### వర్షాలు ప్రారంభం.. ప్రజల కష్టాలు రెట్టింపు

ఇప్పటికే వర్షాకాలం ప్రారంభమవడంతో పరిస్థితి మరింత దిగజారిందని పసుమర్తి రామ్మోహన్‌రావు అన్నారు. మురుగు నీరు నిల్వ ఉండటం, డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడం వల్ల దుర్గంధం భరించలేని స్థాయికి చేరుకుందని చెప్పారు. వ్యాపారులు, స్థానిక ప్రజలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం ఆశ్చర్యకరమన్నారు. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వ్యాపార కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు.

### అధికారుల నిర్లక్ష్యమా..? రాజకీయ ఒత్తిళ్ల ప్రభావమా..?

ఈ మొత్తం వ్యవహారంలో కార్పొరేషన్ అధికారులు, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయని రామ్మోహన్‌రావు అన్నారు. ప్రజలకు నష్టం జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తూ ఉండిపోయారని ఆరోపించారు. ఒక ప్రణాళిక ప్రకారమే ఈ పరిస్థితి సృష్టించబడిందనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయని చెప్పారు. జిల్లా మంత్రికి కూడా తలనొప్పిగా మారిన ఈ సమస్యను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొట్టి శ్రీరాములు రోడ్డులో వ్యాపారం చేస్తున్న వందలాది కుటుంబాల జీవనోపాధి ఈ సమస్య వల్ల దెబ్బతింటోందని పేర్కొంటూ, జిల్లా మంత్రి తక్షణమే జోక్యం చేసుకుని డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ, రోడ్డు పనుల వేగవంతమైన పూర్తి, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు విజ్ఞప్తి చేశారు. "రోడ్డు అభివృద్ధి పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం అభివృద్ధి కాదు.. ప్రజల సమస్యలను పరిష్కరించడమే నిజమైన అభివృద్ధి" అని స్థానిక వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## తల్లి పేరుతో ఒక మొక్క!

- పచ్చని భవిష్యత్తుకు మహత్తర సంకల్పం
- 'ఏక్ పేడ్ మా కే నామ్'ను ప్రజా ఉద్యమంగా మార్చాలి
- బీజేపీ నేత రంగారాజు రుక్మారావు
- ప్రతి కుటుంబం తల్లి పేరుతో మొక్క నాటి సంరక్షించాలి
- పర్యావరణ పరిరక్షణలో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న భారతదేశం

**ఖమ్మం, జూన్ 5 :** పర్యావరణ పరిరక్షణను కుటుంబ విలువలతో అనుసంధానిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన "ఏక్ పేడ్ మా కే నామ్" పిలుపు దేశవ్యాప్తంగా గొప్ప ప్రజా ఉద్యమంగా మారాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగారాజు రుక్మారావు అన్నారు. ప్రతి ఒక్కరూ తమ కన్నతల్లి పేరుతో కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతికి రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లాలోని ఎదలాపురం, వైరా మున్సిపాలిటీల పరిధిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత మొక్కల నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రంగారాజు రుక్మారావు మాట్లాడుతూ, తల్లి మనకు జీవాన్ని ప్రసాదిస్తే, చెట్లు జీవనానికి అవసరమైన ప్రాణవాయువును అందిస్తాయని పేర్కొన్నారు. అందుకే తల్లి పేరుతో మొక్క నాటడం అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాకుండా భావోద్వేగంతో కూడిన సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రుక్మారావు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్ నాయక్, జిల్లా కో-కన్వీనర్ శ్రీరామనేని మణి, చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి సాయి, వేల్పుల సుధాకర్, ఆర్వీఎస్ యాదవ్, కోటమర్తి సుదర్శన్, సత్తి నాగరాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు. "తల్లి పేరుతో ఒక మొక్క -- భవిష్యత్ తరాలకు ఒక జీవన బహుమతి" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు భావోద్వేగ స్పర్శను జోడించి ప్రజల్లో విశేష స్పందనను రేకెత్తించింది.



## ఆ దాడి సమయంలో ఖమేనీ ఆఫీస్‌లోనే ఉన్నా: అబ్బాస్ అరాగ్చీ

**ఇరాన్ :** అమెరికా–ఇజ్రాయెల్ ఫిబ్రవరి 28న ఇరాన్‌పై జరిపిన దాడిలో నాటి సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే, ఆ దాడి సమయంలో తాను సుప్రీం లీడర్ కార్యాలయంలోనే ఉన్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. లెబనాన్ కేంద్రంగా పనిచేసే ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన.. దాడి అనంతరం ఖమేనీ ఆరోగ్య పరిస్థితి ఏంటనే విషయం తెలియక తీవ్ర ఆందోళన చెందానని చెప్పారు. "జెనీవాలో కీలక దౌత్య చర్చలు ముగించుకొని వచ్చా. ఆ వెంటనే నివేదిక ఇవ్వడానికి మరుసటి ఉదయం ఖమేనీ కార్యాలయానికి వెళ్లా. నేను ఆ భవనంలో ఉండగానే దాడి జరిగింది. తాము కూర్చున్న విభాగం కూడా దెబ్బతింది. శిథిలాల నుంచి బయటకు వస్తున్నప్పుడు నా ఆలోచనంతా సుప్రీం లీడర్‌పైనే. నా గురించి పట్టించుకోలేదు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఏంటనే విషయం తెలియక రెండు రోజులు తీవ్ర ఆందోళన చెందా" అని అబ్బాస్ అరాగ్చీ గుర్తు చేసుకున్నారు. అమెరికా, ఇజ్రాయెల్‌ల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో.. సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లాలని అంతకుముందే సుప్రీం లీడర్‌కు సూచించినప్పటికీ అందుకు ఆయన నిరాకరించారని అరాగ్చీ పేర్కొన్నారు. ఇరాన్ పౌరులందరికీ రక్షణ కల్పించే వరకు తాను ఎక్కడికీ వెళ్లనని స్పష్టం చేశారు. తన ప్రజలకు ఏది జరిగితే.. తనకూ అదే జరుగుతుందని ఖమేనీ చెప్పినట్లు పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడులకు అమెరికా సైనిక స్థావరాలను ఉపయోగిస్తే ప్రతీకార చర్యలు తప్పవని గల్ఫ్ దేశాలను ముందుగానే హెచ్చరించామని అరాగ్చీ వెల్లడించారు. పొరుగు దేశాల్లో అమెరికా స్థావరాలు లేకుంటే.. వాటిపై ప్రతీకార దాడులు ఉండేవి కావన్నారు. తమ భూభాగాన్ని ఈ విధంగా వినియోగించడాన్ని ఆయా ప్రభుత్వాలు వ్యతిరేకించినప్పటికీ.. వాటిని పట్టించుకోకుండా అమెరికా ముందుకు వెళ్లిందన్నారు.



## బాలుడిని కడుపులో తన్నిన రోబో

**షింజియాగ్ :** హ్యూమనాయిడ్ రోబో ప్రదర్శనకు వచ్చిన ఓ చిన్నారిని రోబో అనుకోకుండా కడుపులో తన్నడంతో అతడు బాధతో విలవిల్లాడాడు. ఈ ఘటన చైనాలోని షింజియాగ్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో రోబోల తీరుపై నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేశారు. వీడియో ప్రకారం.. చైనాలోని షింజియాగ్‌లోని ఉర్మికి బొటానికల్ గార్డెన్‌లో గురువారం హ్యూమనాయిడ్ రోబోల ప్రదర్శనను ఏర్పాటుచేశారు. వాటిని చూడడానికి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఓ రోబో మార్షల్ ఆర్ట్స్ విన్యాసాన్ని ప్రదర్శిస్తుండగా దానిని చూడడానికి చిన్నారులు చుట్టూ చేరారు. రోబో మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శిస్తూ.. అనుకోకుండా అక్కడ నిలబడి ఉన్న ఓ చిన్నారిని కడుపులో బలంగా తన్నింది. దీంతో ఆ బాలుడు బాధతో విలవిల్లాడుతూ కుప్పకూలిపోయాడు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో రోబోల వల్ల తలెత్తే భద్రతాపరమైన సమస్యలపై నెటిజన్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాగా, రోబో తన్నడంతో గాయపడిన బాలుడికి అక్కడి అధికారులు వెంటనే ప్రథమ చికిత్స చేశారని.. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.



## పర్యావరణ పరిక్షణ అందరి బాధ్యత

### విజయవాడలో సైకిల్ తొక్కిన హోంమంత్రి అనిత

**విజయవాడ, జూన్ 5 :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం, నో వెహికల్ డే సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో సహా ప్రజా ప్రతినిధులు సైకిల్ తొక్కారు. అలానే రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విజయవాడలో తన నివాసం నుంచి ఆటోనగర్ ఫైర్ స్టేషన్ వరకు సైకిల్ తొక్కారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రోజూ ఓ గంట పాటు సైకిల్ తొక్కడం వల్ల ఓవైపు ఆరోగ్యం, మరోవైపు పర్యావరణం బాగుపడతాయని తెలిపారు. ప్రధాని పొదుపు మంత్రంలో భాగంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశా నిర్దేశర మేరకు ప్రతి శుక్రవారం నో వెహికల్ డే పాటిస్తున్నామని ఆమె వెల్లడించారు. 'సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు మంత్రులందరం కాన్వాయ్ వెహికల్‌లను తగ్గించాం. అవకాశం ఉంటే పోలీసులంతా ఒకే వెహికల్లో వెళ్లే యోచన కూడా చేస్తాం. పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుంది. అందుకే ప్రజా ప్రతినిధులంతా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సైకిళ్లు తొక్కుతున్నాం' అని ఆమె తెలిపారు. పెట్రోల్, డీజిల్, బంగారం లాంటివి కొనుగోలు తగ్గించడం వల్ల విదేశీ మారక నిల్వలు పెరుగుతాయి. డాలర్‌తో రూపాయి విలువ తగ్గుతుంది. ఈ విషయాలను ప్రజలందరూ గమనించి పెట్రోల్, డీజిల్ వాడకాలు తగ్గించాలి. సైకిల్ తొక్కాలి అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి' అని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

# ఎస్‌యూ–57ను కలిసి రూపొందిద్దాం

### భారత్‌కు పుతిన్ బిగ్ ఆఫర్

**రష్యా :** వైమానిక దళాన్ని బలోపేతం చేసే దిశగా ఐదోతరం యుద్ధ విమానాన్ని అమ్ములపొదిలో చేర్చుకునేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ నుంచి బిగ్ ఆఫర్ వచ్చింది. అధునాతన స్టెల్త్ సామర్థ్యాలు కలిగిన సుఖోయ్ ఎస్‌యూ–57 యుద్ధ విమానాలను భారత్‌తో కలిసి సంయుక్తంగా అభివృద్ధి, ఉత్పత్తి చేయడానికి, అలాగే కీలక సాంకేతికతలను పంచుకోవడానికి రష్యా సుముఖంగా ఉందని వెల్లడించారు. సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో అంతర్జాతీయ వార్తాసంస్థల అధినేతలతో మాట్లాడిన సందర్భంగా అధ్యక్షుడు ఈ ప్రతిపాదన చేశారు. భారత వైమానిక దళంలో ఐదోతరం యుద్ధ విమానాలు లేవు. మరోవైపు, పాకిస్థాన్ త్వరలో చైనాకు చెందిన షెన్‌యాంగ్ జె–35రూజు స్టెల్త్ ఫైటర్స్‌ను సొంతం చేసుకోనుందని వార్తలు వస్తోన్న వేళ రష్యా నుంచి స్పందన రావడం గమనార్హం. రక్షణరంగంలో తమ రెండు దేశాల మధ్య ఎలాంటి పరిమితులు ఉండవని చెప్పిన పుతిన్.. పరోక్షంగా పాశ్చాత్య దేశాలకు చురకలు అంటించారు. ఆ దేశాలు సాంకేతికతను బదిలీ చేసేందుకు పలు ఆంక్షలు విధిస్తుంటాయని గుర్తుచేశారు. అయితే సు–57 ఫైటర్ జెట్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేసేందుకు రష్యా గతంలోనే భారత్‌కు అవకాశం ఇచ్చింది. 2018లోనే ఆ చర్చలు జరిగాయని ఆయన గుర్తుచేశారు. అయితే భారత్ అప్పుడు ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంది. ఆ యుద్ధ విమానంతో పూర్తిస్థాయి కార్యాచరణ అవసరాలు తీరవని ఐఏఎఫ్ నిర్ధరించడంతో భారత్ వెనక్కి తగ్గింది. ఇదిలాఉంటే.. స్వదేశీ పరిజ్ఞానంతో ఐదోతరం జెట్‌ను తయారు చేసేందుకు భారత్ చేపట్టిన 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్' (ఆమ్కా) ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉంది. 2030 మధ్యలో వైమానిక దళంలో చేరొచ్చని తెలుస్తోంది.



### భారత్-చైనా సంబంధాల్లో జోక్యం ఉండదు: పుతిన్

భారత్–చైనా సంబంధాల్లో తమ జోక్యం ఉండబోదని పుతిన్ స్పష్టం చేశారు. అలాగే ఆ రెండింటి మధ్య ఉన్న సరిహద్దు వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకుంటాయనే విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. ఇక 2030లో తాను మరోసారి ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై ఇప్పుడు మాట్లాడటం తొందరపాటే అవుతుందన్నారు. అప్పటికి తన ఆరోగ్యం ఎలా ఉంటుందో దేవుడికే తెలుసన్నారు. ప్రస్తుతం పరిష్కరించాల్సిన ఎన్నో అంశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

# ఒమన్ చమురు టర్మినల్‌లో పేలుళ్లు

### లోడింగ్ నిలిపివేత



**ఒమన్ :** గల్ఫ్ దేశాలపై ఇరాన్ యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లతో విరుచుకు పడుతోంది. ఈక్రమంలో ఒమన్‌లోని మినా అల్ ఫహల్ ఆయిల్ టెర్మినల్‌లో భారీ పేలుడు సంభవించింది. పెద్దఎత్తున అగ్నికీలలు చెలరేగడంతో అప్రమత్తమైన అధికారులు ఫైరింజన్ సహాయంతో మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. ఇరాన్ డ్రోన్ దాడి కారణంగానే పేలుడు సంభ వించినట్లు స్థానిక అధికా రులు పేర్కొన్నారు. దీంతో టర్మినల్‌లో చమురు లోడింగ్ నిలిపివేశారు. చమురు కోసం వచ్చిన పలు సూపర్ ట్యాంకర్లు అక్కడే చిక్కుకుపోయాయి. మళ్లీ చమురు కార్యకలాపాలు ప్రారంభమయ్యే వరకు అవి అక్కడే వేచి ఉండనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు తమ నౌకాదళం ఒమన్ సముద్రంలోని అమెరికా సైనిక నౌకను లక్ష్యంగా చేసుకుందని ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రకటించిం ది. తమ దేశ జలాల్లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తుండగా దానిపై దాడి చేసినట్లు తెలిపింది. కాగా టెహ్రాన్ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ ఖండించింది. ఒమన్ సముద్ర జలాల్లోని అమెరికా సైనిక ఆస్తులు సురక్షితంగా ఉన్నాయని.. ఏ నౌకపై ఎలాంటి దాడి జరగలేదని స్పష్టంచేసింది.

### అమెరికా తప్పిదం వల్లే కువైట్ ఎయిర్‌పోర్ట్ ధ్వంసం

ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణుల వల్లే కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం తీవ్రంగా దెబ్బతిందని ఆ దేశ అధికారులు వెల్లడించారు. దీనిపై ఐఆర్‌జీసీ స్పందిస్తూ.. విమానాశ్రయ టెర్మినల్‌లో జరిగిన నష్టానికి తాము బాధ్యులం కామని పేర్కొంది. అమెరికా తయారుచేసిన పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థలో సాంకేతిక లోపం వల్ల ఈ విధ్వంసం జరిగిందని తెలిపింది. కాగా ఐఆర్‌జీసీ ఆరోపణలను అమెరికా సైన్యం తిప్పికొట్టింది. ఇరాన్ ఉద్దేశపూర్వకంగా డ్రోన్లతో పౌర విమానాశ్రయంపై దాడి చేసిందని పేర్కొంది. ఈ ఘటనపై అంతర్జాతీయంగా విమర్శలు ఎదురవుతుండడంతో తప్పును కప్పిపుచ్చుకునేందుకు తమపై ఆరోపణలు చేస్తోందని మండిపడింది.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం

- విశాఖలో సైకిల్ తొక్కిన చంద్రబాబు
- ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సైకిల్ సవారీ
- ఆంధ్రా వర్సిటీలో మొక్కలు నాటిన బాబు



**విశాఖపట్నం, జూన్ 5 :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం నేతలు ఉత్సాహంగా సైకిలెక్కారు. చంద్రబాబు సహా నేతలంతా సైకిల్ తొక్కి పర్యావరణాన్ని ప్రచారం చేశారు. విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. ఐదున్నర కిలో మీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో చేరుకున్నారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సీఎం సైకిల్ సవారీ చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు. ఎర్రటి ఎండ కాస్తున్నా ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం సైకిల్ ప్రయాణం సాగింది. సైకిల్ ర్యాలీలో సీఎం చంద్రబాబు వెంట జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు ఉన్నారు. శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, విజయవాడలో హోంమంత్రి అనిత కూడా సైకిలెక్కారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ మొక్కని నాటారు. తిరుమలలో గ్రీనరీ త్వరలో 90 శాతానికి చేరుకోబోతోందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. విశాఖ ఏయూలో మాత్రం కేవలం 25 శాతం మాత్రమే గ్రీనరీ ఉందని.. గ్రీనరీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఏయూ వీసీకి ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లంటూ చంద్రబాబు సరదా వ్యాఖ్యానించారు. ఆంధ్రా యూనివర్సిటీని ఆదర్శంగా తయారు చేయాలని అన్నారు. చరిత్ర గల యూనివర్సిటీ.. ఎంతోమంది నాయకులు, విద్యావేత్తలు, ప్రముఖులను అందించిందని తెలిపారు. నెట్ జీరో కాన్సెప్ట్‌ను ఏయూలో ప్రవేశపెడుతున్నట్లు సీఎం చెప్పారు. వాతావరణ మార్పులపై అందరూ దృష్టి సారించాలన్నారు. యూనివర్సిటీకి కావాల్సిన 100శాతం విద్యుత్ ఇక్కడి నుంచే ఉత్పత్తి చేయాలన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో చెట్లను పెంచాలన్నారు. పిల్లలకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లుగా యూనివర్సిటీలను మార్చాలన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో కమిటీ ఆఫ్ ప్రొఫెసర్స్‌ను పెట్టి ఇన్‌హౌస్ నాలెడ్జ్‌ని అభివృద్ధి చేయాలని అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అన్ని ఇతర కాలేజీలను గైడ్ చేయాలన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారుచేస్తామని తెలిపారు. యాక్షన్ లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. లెక్చరర్స్, స్టూడెంట్స్ అందరూ ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా తాను కూడా సైకిల్ మీద వెళ్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఫొటోల కోసం కాదని.. ఒక అలవాటు కావాలనే ఉద్దేశంతోనే సైకిల్‌పై వెళ్తున్నట్లు తెలిపారు. సైకిల్ తొక్కడం వలన ఎక్సర్సైజ్, ఫిట్నెస్ రెండూ అవుతాయన్నారు. ఏపీలో 33శాతం గ్రీన్ కవర్ ఉందని.. దీన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్నారు. నెట్ జీరో తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా మని.. దీన్ని ఒక ఆదర్శంగా చేస్తామని సీఎం అన్నారు. నెట్ జీరో కార్యక్రమంలో భాగంగా సైకిల్‌పై నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు.




## నేలపై పడిన పార్కింగ్‌లో నిలిపిన విమానం

**ఫ్రాంక్‌ఫర్ట్ :** పార్కింగ్‌లో నిలిపి ఉంచిన లుఫ్తాన్సాకు చెందిన ఓ బోయింగ్ విమానం ఉన్నట్టుండి నేలపై పడింది. ఈ ఘటనలో పలువురు సిబ్బంది గాయపడ్డారు. ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకోగా.. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. లుఫ్తాన్సాకు చెందిన బోయింగ్ 787–9 విమానం ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి లాస్ ఏంజెలెస్‌కు వెళ్లాల్సిఉంది. ఈ క్రమంలో ఫ్రాంక్‌ఫర్ట్ గేటు వద్ద పార్క్ చేసి ఉన్న విమానం ల్యాండింగ్ గేర్ ఉన్నట్టుండి విరిగిపోయింది. దీంతో విమానం ముందుభాగం నేలపై పడింది. ఘటన జరిగిన సమయంలో ఆ విమానంలో ప్రయాణికులు ఎవరూ లేరని ఎయిర్‌లైన్స్ ప్రతినిధి తెలిపారు. అయితే, విమానంలో పలువురు విమానయాన సిబ్బంది, గ్రౌండ్ స్టాఫ్ ఉన్నారని వెల్లడించారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో విమానం తీవ్రంగా దెబ్బతిందని అధికారులు పేర్కొన్నారు. అయితే ప్రమాదానికి గల కారణం ఇంకా తెలియరాలేదు. దీనిపై దర్యాప్తును ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.



## మోదీ గొప్ప స్నేహితుడు

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్ :** ప్రధాని నరేంద్ర మోదీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసిస్తూనే.. భారత్‌పై విమర్శలు చేశారు. అమెరికాపై అధిక సుంకాలు విధించి.. భారత్ ఏళ్లతరబడి లబ్ధి పొందిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇవి చర్చనీయాంశంగా మారాయి. వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. భారత్– అమెరికా మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత సంబంధాల గురించి ఆయన ప్రస్తావించారు. ప్రధాని మోదీ అంటే తనకు చాలా ఇష్టమని.. ఆయన గొప్ప స్నేహితుడని ట్రంప్ అన్నారు. తమ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వాణిజ్య చర్చలకు సంబంధించిన ప్రశ్నకు బదులిస్తూ.. భారతదేశ సుంకాల విధానంపై ఆయన విమర్శలు చేశారు. 'ఏళ్లతరబడి.. అమెరికా నుంచి భారత్ చాలా లబ్ధి పొందింది. మాపై వారు భారీగా సుంకాలు విధించారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం భారత్ నుంచి మేం భారీగా లాభాలు పొందుతున్నాం' అని వ్యాఖ్యానించారు. భారత్– అమెరికా మధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదురుతుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడమే లక్ష్యంగా ఇరుదేశాల ప్రతినిధుల మధ్య నాలుగు రోజుల పాటు సాగిన చర్చలు ముగిశాయి. ఈ క్రమంలో ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఒప్పందానికి సంబంధించిన చర్చలు సహకార స్ఫూర్తి, ఆచరణాత్మకంగా ముగిశాయని వాణిజ్య శాఖ తెలిపింది. వస్తువుల వాణిజ్యం, కస్టమ్స్ విధానాలు, వాణిజ్య సౌలభ్యం, టారిఫేతర చర్యలు, ఆర్థిక భద్రతా సహకారం వంటి పలు అంశాలపై చర్చలు సాగినట్లు పేర్కొంది.



## భాజపాకు అన్నామలై గుడ్‌బై.. రాజీనామాకు ఆమోదం

**తమిళనాడు :** ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తమిళనాడులో రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. ఈ రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై పార్టీని వీడారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ శుక్రవారం ఆమోదించారు. కొత్త పార్టీ ఏర్పాటు దిశగా అన్నామలై ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'తమిళగ మక్కల్ కళగం' లేదా 'తమిళగ మక్కల్ కట్చి' అనే పేరుతో పార్టీని స్థాపించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన 'వియ్ లీడర్స్' అనే ట్రస్టును నిర్వహిస్తున్నారు. దీన్ని మరింత విస్తరించి రాజకీయ ఉద్యమంగా మార్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కర్ణాటక క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఉన్న అన్నామలై.. 2019లో ఉద్యోగానికి రాజీనామా చేసి, మోదీ పాలన స్ఫూర్తితో 2020లో భాజపాలో చేరారు. అప్పటినుంచి తమిళనాడులో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా సేవలందించారు. పాదయాత్ర చేసి పార్టీ విస్తరణకు కృషి చేశారు. అయితే, ఇటీవల జరిగిన ఎన్నికల్లో భాజపా.. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకున్న సంగతి తెలిసిందే. దీనిపై అన్నామలై అసంతృప్తి వ్యక్తంచేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయనను పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించడం, ఎన్నికల్లో టికెట్ ఇవ్వకపోవడం రాజీనామాకు కారణమైనట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

# భారత్‌లో డేటా సెంటర్ల ఏర్పాటుకు భారీ పెట్టుబడి

**న్యూఢిల్లీ :** బ్లాక్ స్టోన్, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్‌కు చెందిన ఎయిర్‌ట్రంక్ సంస్థ భారత్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. దేశంలో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన కోసం భారీ పెట్టుబడిని ప్రకటించింది. భారత్‌లో డేటా సెంటర్ల ఏర్పాటు కోసం 30 బిలియన్ డాలర్లు (సుమారు రూ.3 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. 2030 నాటికి 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లను అభివృద్ధి చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఎయిర్‌ట్రంక్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాబిన్ ఖుదా భారత్ పర్యటన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ వంటి అంశాల్లో ఇలాంటి పెట్టుబడులు భారత్‌ను గ్లోబల్ హబ్‌గా నిలుపుతాయని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. భారతదేశాన్ని గ్లోబల్ ఏఐ పవర్‌హౌస్‌గా మార్చాలనే ప్రధాని విజన్‌కు ఈ పెట్టుబడి మద్దతుగా నిలుస్తుందని రాబిన్ ఖుదా పేర్కొన్నారు. ఈ పెట్టుబడి వల్ల స్థానికంగా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. రహదారులు, పోర్టులు, పవర్ నెట్‌వర్కులు ఏవిధంగా దేశ ఆర్థిక వృద్ధికి అవసరమో.. డిజిటల్ మౌలికవసతులు కూడా అంతే అవసరమని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది.








# యథాతథంగా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లు

- ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బీఐ
- రెపోరేటును యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి

**ముంబై, జూన్ 5 :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తు న్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నాం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు నిబంధనలను సరళీకరించాం. ఈక్విటీ మార్కెట్‌లో ఎన్‌ఆర్‌ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచాం. ఎక్స్ఛేంజ్ రేట్‌పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. మన దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆర్థికంగా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా, అప్రమత్తంగా ఉంది.


# తుది జట్టు ఎంపికలో మా యాజమాన్యం జోక్యం

### ఇంగ్లాండ్ క్రికెటర్ లివింగ్ స్టోన్



ఐపీఎల్‌లో నైపుణ్యం లేదు.. బోర్ కొడుతోందంటూ రెండు రోజుల కిందట సంచలన వ్యాఖ్యలు చేశాడు ఇంగ్లాండ్ క్రికెటర్ లియామ్ లివింగ్ స్టోన్. తాజాగా మరోసారి ఐపీఎల్ ప్రస్తావన తీసుకొచ్చాడు. అయితే, ఇప్పుడు తన జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యాజమాన్యాన్ని ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ సీజన్‌లో అతడు కేవలం రెండే మ్యాచుల్లోనే కనిపించాడు. దీంతో తమ తుది జట్టు ఎంపికలో యాజమా న్యం జోక్యం ఉందని లివింగ్‌స్టోన్ వ్యాఖ్యానించాడు. కేవలం ముగ్గురే విదేశీ క్రికెటర్లను ఆడించిన ఫ్రాంచైజీ.. తనకు అవకాశాలు మాత్రం ఇవ్వలేదని పేర్కొన్నాడు. "ఐపీఎల్‌లో మూడు రకాల పద్ధతులు ఉన్నాయని అనుకుం టున్నా. అందులో ఒకటి.. మీరు జట్టులో స్థిరపడిపోతారు. మీకోసం అంతా సిద్ధంగా ఉంటుంది. ఇక రెండోది.. మీకు ఆడే అవకాశం రావచ్చు లేదా రాకపోవచ్చు. అది సందిగ్ధత. అప్పుడు మీ ఆలోచనలు 'ఒకవేళ నేను ఆడితే.. ఇలా జరగబోతోంది' అనేవిధంగా ఉంటాయి. నా విషయంలోనూ ఇలాగే జరిగింది. సన్‌రైజర్స్‌కు వెళ్లినప్పుడు.. వేలంలో ముంబయి ఇండియన్స్ కోరుకున్న ఓ ఆటగాడి కోసం మా జట్టు పోటీపడింది. మా దగ్గర ఎక్కువ సొమ్ము ఉండటంతో అతడిని తీసుకోగలిగాం. యజమా న్యానికి బాగా నచ్చాడు. అతడు తుది జట్టులోనూ ఆడటం ఖాయమైంది. అలాగే ఆడాడు. ప్యాట్ కమిన్స్ కొన్ని మ్యాచులకు అందుబాటులో లేడు. ఆ సమయంలోనూ మేం కేవలం ముగ్గురు విదేశీ క్రికెటర్లతోనే బరిలోకి దిగాం. ఇదే విషయాన్ని మా కోచ్ డానియల్ వెటోరీని అడిగా. "ఓనర్లకు ఆ కుర్రాడు బాగా నచ్చాడు. అతడి కోసం ప్లేస్ కేటాయించాలి. కమిన్స్ వచ్చినా సరే.. తుది జట్టులో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో నేను ఎక్కువ మ్యాచులు ఆడటం లేదని అర్థమైపోయింది. ఎవరైనా గాయపడితేనే అవకాశం వస్తుందని గ్రహించా. దీంతో మ్యాచుల్లో ఆడటం లేదని తెలిసినప్పుడు దృక్పథం కూడా పూర్తిగా మారిపోతుంది. అయితే, మేనేజ్‌మెంట్ ఎందుకు అలాంటి నిర్ణయం తీసుకుందో నాకు తెలియదు. ఈ సీజన్‌లో నాకు బాగా అనిపించిన విషయం డానియల్ వెట్టోరీ. అతడు ముందే నాకు విషయాలను చెప్పేవాడు" అని లివింగ్‌స్టోన్ తెలిపాడు.

# వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం!



భారత బ్యాటింగ్ సూపర్ స్టార్ విరాట్ కోహ్లీ క్రికెట్ అభిమానులకు గట్టి షాక్ ఇచ్చారు. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్ మొత్తానికి ఆయన దూరమయ్యారు. ఈ విషయాన్ని ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ గురువారం (జూన్ 4) వెల్లడించింది. ఇటీవల ఆదివారం (మే 31) జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున గుజరాత్ టైటాన్స్‌పై 42 బంతుల్లో 75 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్న 37 ఏళ్ల కోహ్లీ.. అదే మ్యాచ్‌లో గాయపడ్డారు. ఫలితంగా ఆఫ్ఘనిస్తాన్‌తో భారత్ ఆడబోతున్న మొట్టమొదటి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో ఆయన భాగం కాలేకపోతున్నారు. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా కోహ్లీ వన్డే సిరీస్‌కు దూరం కావలసి వచ్చింది. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లోనే ఆయనకు ఈ గాయమైంది. స్కానింగ్ రిపోర్టులలో ఆయనకు 'డిస్టల్ సెమీమెంబ్రానోసస్ టెండన్ టియర్'అయినట్లు తేలింది" అని బీసీసీఐ వర్గాలు పీటీఐతో పేర్కొన్నాయి. ఇది మోకాలి వెనుక భాగం కింద ఉండే హ్యామ్‌స్ట్రింగ్ కండరాలను అనుసంధా నించే దట్టమైన నరానికి సంబంధించిన ఒక అరుదైన గాయం. అయితే కోహ్లీ గాయంపై మరియు సిరీస్ నుండి ఆయన తప్పుకోవడంపై బీసీసీఐ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. విరాట్ కోహ్లీ దూరం కావడంతో ఆయన స్థానంలో యశస్వి జైస్వాల్ లేదా రుతురాజ్ గైక్వాడ్‌లను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. న్యూజీలాండ్‌తో జరిగిన గత వన్డే సిరీస్‌లో జైస్వాల్ జట్టులో ఉన్నప్పటికీ ఆడే అవకాశం రాలేదు. మరోవైపు గైక్వాడ్ గత ఏడాది దక్షిణాఫ్రికా సిరీస్‌లో మిడిల్ ఆర్డర్‌లో ఆకట్టుకున్నాడు. అయితే, ప్రస్తుతం గైక్వాడ్ శ్రీలంకలో జరగబోయే త్రైపాక్షిక సిరీస్ కోసం 'ఇండియా ఎ' జట్టులో ఉన్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను మే 19నే ఈ చారిత్రక హోమ్ సిరీస్ కోసం ఎంపిక చేశారు. అయితే ఐపీఎల్ 2026లో హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో బాధపడిన రోహిత్.. ఫిట్‌నెస్ సాధిస్తేనే ఆడతాడనే నిబంధనతో జట్టులోకి తీసుకున్నారు. ఆయన ఈ సిరీస్ మొత్తానికి అందుబాటులో ఉంటాడా లేదా అనేది ఇంకా చూడాల్సి ఉంది.

**భారత్-ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్ షెడ్యూల్:** మొదటి వన్డే: జూన్ 13 (శనివారం) -- ధర్మశాల (హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం). రెండవ వన్డే: జూన్ 17 (బుధవారం) -- లక్నో (భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఏకానా క్రికెట్ స్టేడియం). మూడో వన్డే: జూన్ 20 (శనివారం) -- చెన్నై (చెపాక్)

# జైస్వాల్‌తో కలిసి ఓపెనర్‌గా బరిలోకి రాహుల్



న్యూచండీగఢ్‌లో జరుగుతున్న ఈ చారిత్రాత్మక మొదటి టెస్ట్ మ్యాచ్‌కు ముందు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మీడియాతో మాట్లాడారు. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగబోయే జట్టు కలయికపై ఆయన కొన్ని కీలక సంకేతాలు ఇచ్చారు. ఆ సూచనల ఆధారంగా అఫ్గానిస్తాన్‌తో తలపడే భారత్ అంచనా తుది జట్టు ఇలా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం టెస్ట్ ర్యాంకింగ్స్‌లో భారతదేశం తరఫున అత్యుత్తమ స్థానంలో ఉన్న ఈ యువ ఓపెనర్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించడం ఖాయమైంది. జైస్వాల్‌తో కలిసి రాహుల్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్‌కు అతడిని టీమిండియా వైస్ కెప్టెన్‌గా కూడా మేనేజ్‌మెంట్ నియమించింది. ఎడమచేతి వాటం బ్యాటర్ సాయి సుదర్శన్ నంబర్ 3 పొజిషన్‌లో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉందని కోచ్ గంభీర్ హింట్ ఇచ్చారు. ఐపీఎల్ 2026లో 722 పరుగులతో సూపర్ ఫామ్‌లో ఉన్న సుదర్శన్, అదే జోరును టెస్టుల్లోనూ కొనసాగించాలని పట్టుదలగా ఉన్నాడు.జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన రెగ్యులర్ స్థానమైన నంబర్ 4లో బ్యాటింగ్‌కు రానున్నాడు. మెడ గాయం కారణంగా గువాహటిలో సౌతాఫ్రికాతో జరిగిన గత టెస్టుకు దూరమైన గిల్.. ఇప్పుడు పూర్తిగా కోలుకుని జట్టులోకి పునరాగమనం చేస్తున్నాడు. వికెట్ కీపర్ బ్యాటర్‌గా పంత్ నంబర్ 5లో బరిలోకి దిగనున్నాడు. అఫ్గానిస్తాన్‌తో జరిగే ఈ మ్యాచ్ పంత్‌కు కెరీర్‌లో 50వ టెస్ట్ కావడం విశేషం. ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డి తుది జట్టులో చోటు దక్కించుకోవడం దాదాపు ఖాయమైంది. బ్యాట్, బాల్ రెండింటితోనూ రాణించాలని ఈ యువ ఆటగాడు చూస్తున్నాడు. స్పెషలిస్ట్ స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా సుందర్ తుది జట్టులో ఉంటాడు. విదర్భ స్పిన్నర్ హర్ష్ దూబే.. మానవ్ సుతార్‌ను కాదని న్యూచండీగఢ్ టెస్టులో అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నాయి. ఐపీఎల్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినప్పటికీ, కుల్దీప్ స్థానానికి ఎలాంటి ఢోకా లేదు. రవీంద్ర జడేజా అందుబాటులో లేకపోవడంతో భారత స్పిన్ విభాగాన్ని అతడే ముందుండి నడిపించనున్నాడు. భారత పేస్ దళానికి సిరాజ్ నాయకత్వం వహించనున్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ అతడే కావడం గమనార్హం. పంజాబ్ అన్‌క్యాప్డ్ పేసర్ గుర్నూర్ బ్రార్ కంటే ప్రసిద్ధ్ కృష్ణకే తుది జట్టులో ఎక్కువ అవకాశం ఉంది. సిరాజ్‌తో కలిసి అతడు పేస్ బాధ్యతలను పంచుకోనున్నాడు.

**టీమిండియా తుది జట్టు (అంచనా):** శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, కుల్దీప్ యాదవ్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ


# లార్డ్స్‌లో న్యూజిలాండ్ 113కే ఆలౌట్



లార్డ్స్ మైదానం వేదికగా జరుగుతున్న ఇంగ్లండ్ - న్యూజిలాండ్ మొదటి టెస్టు ఆసక్తికరంగా మారింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 140 పరుగులకు ఆలౌట్ కాగా.. న్యూజిలాండ్ 113 పరుగులకే పది వికెట్లు కోల్పోయింది. 65/6తో రెండో రోజు ఆట ప్రారంభించిన న్యూజిలాండ్ తొలి బంతికే గ్లెన్ ఫిలిప్స్ వికెట్ కోల్పోయింది. ఫిలిప్స్ అవుటయినప్పటికీ న్యూజిలాండ్ టెయిలెండర్స్ రాణించడం విశేషం. కైల్ జెమీసన్ రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 38 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.ఇంగ్లండ్ - న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న లార్డ్స్ టెస్టు రసవత్తరంగా సాగుతోంది. ఈ టెస్టులో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ జట్టు ఇంగ్లండ్‌ను తొలి ఇన్నింగ్స్ 140 పరుగులకే ఆలౌట్ చేసింది. ఇంగ్లండ్ కూడా అదే జోష్‌తో న్యూజిలాండ్ ఆరు వికెట్లు పడగొట్టింది. తొలి రోజే ఇరు జట్లు 16 వికెట్లు కోల్పోయింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ 65/7తో ముగించింది. రెండో రోజు ఆట ప్రారంభమైన తొలి బంతికే గ్లెన్ ఫిలిప్స్ వికెట్ కోల్పోయాడు. ఇంగ్లండ్ బౌలర్ జోష్ టంగ్ తొలి బంతికే ఫిలిప్స్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో న్యూజిలాండ్ 80 పరుగుల లోపే ఆలౌట్ అవుతుందని అందరూ అనుకున్నారు. కానీ బౌలింగ్‌లో ఐదు వికెట్లు తీసుకున్న జెమీసన్.. బ్యాట్‌తో కూడా రెచ్చిపోవడంతో న్యూజిలాండ్ 100 పరుగులు దాటేసింది. జెమీసన్‌కు తోడు నాథన్ స్మిత్ కూడా రాణించాడు. ఆఖర్లో వరుస వికెట్లు పడటంతో ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ స్కోర్‌కు 27 పరుగుల దూరంలో కివీస్ ఆలౌట్ అయింది. ఓవర్ నైట్ స్కోర్ 65/7 స్కోర్‌తో రెండో రోజు బ్యాటింగ్‌కి వచ్చిన న్యూజిలాండ్ జట్టు తొలి సెషన్‌లోనే ఆలౌట్ అయింది. గ్లెన్ ఫిలిప్స్ 65 పరుగుల వద్ద అవుటైన తర్వాత న్యూజిలాండ్ టెయిలెండర్స్ 48 పరుగులు జోడించడం విశేషం. కైల్ జెమీసన్ 29 బంతుల్లో రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 38 పరుగులతో నాటౌట్‌గా నిలిచి, ఇంగ్లండ్ బౌలర్లకు కాసేపు చెమటలు పట్టించాడు. అవతలి ఎండ్‌లో మరో బ్యాటర్ నిలబడినా మొదటి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ లీడింగ్‌లోకి వచ్చేసేది. విలియమ్ ఓరూర్క్ 1, మ్యాట్ హెన్రీ డకౌట్ కావడంతో 113 పరుగులకే ఆలౌట్ కావాల్సి వచ్చింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్సన్ ఐదు వికెట్లు తీసుకోగా, జోష్ టంగ్ మూడు వికెట్లు పడగొట్టాడు. గస్ అట్కిన్సన్ రెండు వికెట్లు తీసుకున్నాడు. పేసర్లకే మొత్తం పది వికెట్లు దక్కడం విశేషం. కివీస్ 113 పరుగులకే ఆలౌట్ కావడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 27 పరుగుల ఆధిక్యం సాధించింది.

# పాలిమర్ కరెన్సీ నోట్లు : ఆర్‌బీఐ

**ముంబై, జూన్ 5 :** పాలిమర్ కరెన్సీ నోట్లపై ఆర్‌బీఐ కీలక ప్రకటన చేసింది. ఈ నోట్లను చలామణిలోకి తెచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. అయితే ఈ ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని చెప్పారు. కాగితపు కరెన్సీకి ఉన్న గిరాకీ నేపథ్యంలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను ముద్రించాలన్న ఆలోచనను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పదేళ్ల క్రితమే ప్రతిపాదించింది. కాగితపు కరెన్సీని ముద్రించడానికి అయ్యే వ్యయం, నోట్లు చేతులు మారే క్రమంలో అవి పాడైపోవడం వంటి వాటిని దృష్టిలోఉంచుకొని అప్పట్లో ఆర్‌బీఐ (=దీ×) ఆ ప్రతిపాదన చేసింది. దేశవ్యాప్తంగా ట్రయల్ పద్ధతిలో రూ.10 విలువైన ఒక బిలియన్ ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టనున్నట్లు ఆ సమయంలో పార్లమెంట్‌కు కేంద్రం తెలియజేసింది. అందుకు కొచ్చి, మైసూర్, జైపూర్, శిమ్లా నగరాలను ఎంచుకుంది. అయితే సాంకేతిక, కార్యాచరణ సమస్యల కారణంగా ఆ ఆలోచన కార్యరూపం దాల్చలేదు.



# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

**ముంబాయి :** దేశీయ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు, ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ ప్రకటించిన నేపథ్యంలో మన సూచీల్లో ఊగిసలాట కనిపించింది. ఐటీ, మెటల్ సెక్టార్ల షేర్లు నష్టపోయాయి. ఉదయం సెన్సెక్స్ 74,629 వద్ద ప్రారంభమైంది. క్రితం ముగింపుతో పోలిస్తే మార్కెట్ లాభాల్లోనే ప్రారంభమైంది. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ ప్రకటన తర్వాత మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 116 పాయింట్ల నష్టంతో 74,243 వద్ద ముగియగా.. నిఫ్టీ 49 పాయింట్ల నష్టంతో 23,366 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.94 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ సూచీలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌యూఎల్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు రాణించాయి. హిందాల్కో, విప్రో, ట్రెంట్, కోల్ ఇండియా, టీసీఎస్ షేర్లు నష్టపోయాయి. రూపాయిని బలోపేతం చేసేలా దేశంలోకి డాలర్ల రూపంలో పెట్టుబడులు రప్పించే ఉద్దేశంతో కేంద్రం ఎల్‌టీసీజీ పన్నును తొలగించింది. అదే సమయంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నామని, రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నామని ఆర్‌బీఐ వెల్లడించింది. దీంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు ఒత్తిడికి గురయ్యాయి.

# శ్రీలంకలో అడుగుపెట్టిన ఇండియా-ఏ టీమ్..

### భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ మధ్య ట్రై సిరీస్

శ్రీలంక వేదికగా ఓ ట్రై సిరీస్‌ను బీసీసీఐ ప్లాన్ చేసింది. భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాల 'ఏ' జట్లను ఈ సిరీస్ కోసం ఎంపిక చేశారు. జూన్ 9 నుంచి మొదలయ్యే ఈ సిరీస్ జూన్ 21 వరకు సాగుతోంది. ఈ సిరీస్ కోసం ఇండియా ఏ జట్టు శ్రీలంకలో అడుగుపెట్టింది. ఈ సిరీస్‌లో అందరి దృష్టి ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ మీదే ఉంది. ఈ సిరీస్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ శ్రీలంక గడ్డపై అడుగుపెట్టాడు. ఐపీఎల్ 2026లో విధ్వంసం సృష్టించిన 15 ఏళ్ల వైభవ్.. ఇప్పుడు ఇంటర్నేషనల్‌లో తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. శ్రీలంక వేదికగా జరగనున్న ట్రై సిరీస్ కోసం ఇండియా ఏ జట్టు శ్రీలంక చేరుకుంది. మొత్తం ఏడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాలు పాల్గొంటున్నాయి. భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాల మధ్య ట్రై సిరీస్ జరగనుంది. ఈ మూడు దేశాల ఏ కేటగిరి జట్లు ఈ ట్రై సిరీస్‌లో పాల్గొంటున్నాయి. ఈ సిరీస్‌కు శ్రీలంక ఆతిథ్యమివ్వనుంది. వన్డే ఫార్మాట్‌లో జరిగే ఈ సిరీస్ రానున్న ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ కోసం యువ ఆటగాళ్లను ఎంపిక చేసేందుకు ఉపయోగపడనుంది. ఈ సిరీస్‌లో ఐపీఎల్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇండియా ఏ జట్టుకు తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరించనుండటం విశేషం. వైస్ కెప్టెన్‌గా ఎంపికైన రియాన్ పరాగ్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. దాంతో వైస్ కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేశారు. బీసీసీఐ చెప్పిన ప్రకారం వన్డే ట్రై సిరీస్ మ్యాచ్‌లు దంబుల్లాలో జరుగుతాయి. ఈ సిరీస్ ముగిసిన వెంటనే ఇండియా - ఏ, శ్రీలంక - ఏ జట్ల మధ్య రెండు రోజుల రెడ్ బాల్ మ్యాచ్‌లు గాలేలో నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌కు సంబంధించి భారత జట్టును ఇంకా ప్రకటించలేదు.

జనం వార్త



# దూత వెబ్ సిరీస్‌కు నిర్మాతగా నాగచైతన్య



'దూత' వెబ్‌సిరీస్‌తో తొలి ప్రయత్నంలోనే విజయా న్ని అందుకున్నారు నటుడు నాగచైతన్య. ఇప్పుడు ఈ హిట్ సిరీస్‌కు సీక్వెల్ సిద్ధమవుతోంది. శుక్రవారం పూజా కార్యక్రమాలు జరగ్గా.. నాగార్జున క్లాప్ కొట్టి దీన్ని ప్రారంభించారు. ఈ సీక్వెల్‌కు నాగచైతన్య నిర్మాతగా వ్యవహరించనుండటం విశేషం. 'దూత సెకండ్ చాప్టర్‌లో నిర్మాతగా నా తొలి అడుగు' అంటూ నాగచైతన్య ఫొటోలు పంచుకున్నారు. మరోసారి మ్యాజిక్ చూడడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో రూపొందిన 'దూత'.. 2023 డిసెంబరు 1న 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో విడుదలై పలు రికార్డులు సొంతం చేసుకుంది. ఈ హారర్ మిస్టరీ థ్రిల్లర్‌లో జర్నలిస్టు సాగర్ వర్మ అవధూరిగా నాగచైతన్య ఆకట్టుకున్నారు.

# పెద్దిలో జాన్వీ పాత్రపై విమర్శలు

**సరైన ప్రాధాన్యం లేదంటూ సోషల మీడియా పోస్ట్**


**జాన్వీ లైక్ కొట్టడంతో మరింత దుమారం**

నటి జాన్వీకపూర్ ఒక ఇన్‌స్టా పోస్ట్‌కు చేసిన లైక్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. దీనికి సంబంధించి ఇన్‌స్టాలో ఓ పేజ్ పెట్టిన రివ్యూను జాన్వీకపూర్ లైక్ చేశారు. అయితే ఆ రివ్యూలో జాన్వీకపూర్ పాత్రకు సరైన ప్రాధాన్యం దక్కలేదని రాశారు. 'పెద్ది: భారతీయ సినిమా చరిత్రలో ఒక కథానాయికకి జరిగిన అత్యంత అవమానం' అని హెడ్డింగ్ పెట్టారు. దీన్ని జాన్వీ లైక్ చేయడం ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారింది. తన పాత్రకు ప్రాధాన్యం దక్కలేదని జాన్వీ స్వయంగా సమర్థించారని కొందరు అంటుంటే.. పొరపాటున కొట్టి ఉంటారని మరికొందరు భావిస్తున్నారు. ఈ వార్తలు రావడంతో జాన్వీ ఆ పోస్ట్‌ను అన్‌లైక్ చేశారు. అయితే ఈలోపే దీనికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌లు నెట్టింట ప్రత్యక్షమయ్యాయి. రూ.350 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో జాన్వీకపూర్ 'అచ్చియమ్మ' పాత్రలో కనిపించిన విషయం తెలిసిందే. ఇక భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు కలెక్షన్లలో జోరు చూపించింది. మొదటి రోజు ప్రీమియర్స్‌తో కలిపి రూ.135 కోట్లు వసూలు చేసింది.

# పెద్ది కలెక్షన్ల సునామీ

## తొలిరోజే రూ.135.36 కోట్లు వసూలు

### బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల




ఆటలోనూ, పోరాటంలోనూ ఛాంపియన్ అనిపించుకున్నాడు 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన ఈ సినిమా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి హిట్‌గా నిలిచింది. పెద్దిగా రామ్ చరణ్ తన నటనతో మెప్పిస్తుండగా.. చాలా రోజుల తర్వాత ఆయన ఖాతాలో హిట్ పడిందంటూ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సినిమా మొదటి రోజు కలెక్షన్స్‌ను నిర్మాణ సంస్థ తాజాగా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఫస్ట్‌డే రూ.135.36 కోట్లు వసూలుచేసినట్లు అధికారికంగా ప్రకటించింది. 'బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల చేసింది. 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద తొలిరోజే కలెక్షన్ల సునామీ సృష్టించింది. గురువారం ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే ఏకంగా రూ. 135.36 కోట్ల గ్రాస్ వసూలు చేసి సరికొత్త రికార్డులను సృష్టించినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ అద్భుతమైన ఓపెనింగ్స్‌తో భారతీయ చిత్ర పరిశ్రమలో సరికొత్త సంచలనం సృష్టించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో గురువారం నాడు సుమారు రూ. 51 కోట్ల నెట్ కలెక్షన్స్ సాధించగా, బుధవారం నాటి పెయిడ్ ప్రివ్యూల ద్వారా మరో రూ. 18.50 కోట్లు రాబట్టింది. దీనితో మొత్తంగా ఇండియా నెట్ కలెక్షన్ రూ. 69.50 కోట్లకు చేరింది. ఇక ఇండియా గ్రాస్ కలెక్షన్ దాదాపు రూ. 82.49 కోట్లుగా నమోదు కాగా, ఓవర్సీస్ గ్రాస్ సుమారు రూ. 30 కోట్లుగా ఉంది. మరోవైపు వర్కింగ్ డే అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోని థియేటర్లలో దాదాపు 68 శాతం ఆక్యుపెన్సీతో ప్రేక్షకులు థియేటర్లకు బారులు తీరారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, జగపతి బాబు, దివ్యేందు ముఖ్య పాత్రలు పోషించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన అద్భుతమైన సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ చరణ్ అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతుండటంతో, వీకెండ్ ముగిసే సరికి ఈ కలెక్షన్ల జోరు మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా, ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు అన్నదే ఉండదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగినవాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేసుకుంటుంటాడు. పేరుకి కూలి అయినా క్రికెట్‌లో మాత్రం రాటుదేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటారు. అలాంటి ఆటగాడు క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సివచ్చింది? పెద్ది ప్రయాణంపై అప్పలసూరి (జగపతిబాబు), గౌర్‌నాయుడు (శివరాజ్‌కుమార్) ఎలాంటి ప్రభావం చూపించారు? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

# జననాయగన్ మూవీ రిలీజ్ వ్యవహారం

## థియేట్రికల్ ఒప్పందాలు రద్దు చేసుకున్నట్లు వార్తలు

ఈ ఏడాది ప్రారంభం నుంచి వార్తల్లో ఉన్న చిత్రం 'జననాయగన్'. తమిళనాడు ముఖ్యమంత్రి, అగ్ర కథానాయకుడు విజయ్ చివరి సినిమాగా రూపొందిన 'జననాయగన్' సెన్సార్ కారణంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్, నాన్-థియేట్రికల్ డీల్స్ విషయంలో విజయ్ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. జనవరి 9నే 'జననాయగన్' థియేటర్లలోకి రావాల్సిఉంది. అయితే, సెన్సార్ పరమైన కొన్ని ఇబ్బందుల వల్ల చివరి నిమిషంలో వాయిదా పడింది. ఐదు నెలలు గడిచినా ఇప్పటివరకు రిలీజ్ డేట్‌పై ఎలాంటి స్పష్టత రాలేదు. ఇప్పటికే ఈ సినిమా నాన్-థియేట్రికల్ ఒప్పందాలు రద్దయినట్లు



తెలుస్తోంది. దీనితోపాటు ఇప్పటివరకు జరిగిన అన్ని థియేట్రికల్ అగ్రిమెంట్లను కూడా రద్దు చేసి, డిస్ట్రిబ్యూటర్లకు అడ్వాన్స్ డబ్బులను తిరిగి ఇచ్చేయాలని విజయ్ నిర్మాతలకు సూచించినట్లు సమాచారం. దీంతో నిర్మాణసంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ మీటింగ్ ఏర్పాటుచేసినట్లు తెలుస్తోంది. సినిమా విడుదల తేదీ ఖరారైన తర్వాత సొంతంగా రిలీజ్ చేసుకోవాలని విజయ్ సలహా ఇచ్చారట. హెచ్.వినోద్ దర్శకత్వంలో సామాజిక కథాంశంతో రూపొందిన చిత్రం 'జన నాయగన్'. ఈ పొలిటికల్ డ్రామాను కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించింది. ఇందులో విజయ్‌కు జోడీగా పూజా హెగ్డే నటించారు. మమితా బైజూ, బాబీ దేవోల్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం తెలుగు హిట్ సినిమా 'భగవంత్ కేసరి' ఆధారంగా రూపొందినట్లు గతంలో వార్తలు వచ్చాయి.

# సుదీర్ఘ కాలం తరువాత వైష్ణవ్ తేజ్ మూవీకి ఓకే

'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌లోకి బ్లాక్‌బస్టర్ ఎంట్రీ ఇచ్చిన మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్, గత కొంతకాలంగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాలిడ్ హిట్‌తో మళ్లీ ట్రాక్‌లోకి ఎక్కాలనే పట్టుదలతో ఉన్న ఈ యంగ్ హీరో, కథల ఎంపిక కోసం గత మూడు సంవత్సరాలలో ఏకంగా 100కు పైగా స్క్రిప్ట్‌లను తిరస్కరించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో గట్టి టాక్ నడుస్తోంది. అయితే ఎట్టకేలకు ఈ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ వైష్ణవ్ తేజ్ తన తదుపరి సినిమాను అధికారికంగా ఖరారు చేశారు. యువ దర్శకుడు మహేష్ ఎస్ చెప్పిన ఒక కథ ఈ యంగ్ హీరోను ఎంతగానో ఆకట్టుకోవడంతో ఆయన వెంటనే ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. గతంలో సుధీర్ బాబు హీరోగా వచ్చిన 'హంట్' చిత్రానికి మహేష్ ఎస్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. టాలీవుడ్‌లో వరుస క్రేజీ చిత్రాలను నిర్మిస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెలలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనతో పాటు మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర యూనిట్ వెల్లడించనుంది. ఆ వెంటనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను కూడా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఎంతో ఆలోచించి వైష్ణవ్ తేజ్ ఓకే చేసిన ప్రాజెక్ట్ కావడంతో మెగా అభిమానుల్లో ఈ సినిమాపై అప్పుడే భారీ అంచనాలు నెలకొన్నాయి.






# జూలైలో విడుదల దిఇండియా స్టోరీ

## కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో

భారతదేశంలో జరిగిన కొన్ని నమ్మలేని సంచలన నిజాల ఆధారంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ అండ్ హార్డ్ హిట్టింగ్ మూవీ 'ది ఇండియా స్టోరీ'. 'స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, శ్రేయాస్ తల్పాడే కీలక పాత్రలో నటిస్తున్నాడు. సాగర్ బీ దేశ్‌పాండే దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీతో పాటు టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కానుంది. దేశవ్యాప్తంగా ఉన్న సినిమా ప్రియులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని హిందీ, తమిళం మరియు తెలుగు భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక టీజర్ చూస్తుంటే.. సమాజంలో దాగి ఉన్న అత్యంత దిగ్భ్రాం÷-రతికరమైన నిజాలను, తెరవెనుక జరిగిన పరిణామాలను కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నామని చిత్ర యూనిట్ ఈ సందర్భంగా ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒక విలక్షణమైన కథాంశంతో, ప్రేక్షకులను ఆలోచింపజేసే సస్పెన్స్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది.



PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com